# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 61 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 22 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 61 22-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




## అల్లుడొచ్చారు

అమెరికా వైస్ ప్రెసిడెంట్ ఇండియాకు రాక

- మిగతా 3 లో..



# పోప్ ఫ్రాన్సిస్ మృతి

### -ప్రధాని మోదీ సంతాపం

### పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల చంద్రబాబు, నారా లోకేశ్, జగన్ సంతాపం

**న్యూఢిల్లీ ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్ సోమవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మృతికి ఆయన సంతాపాన్ని తెలిపారు. ఆయన మరణం తనను తీవ్రంగా కలత పెట్టిందన్నారు. భారత ప్రజలపై పోప్ ఫ్రాన్సిస్ ప్రేమాభిమానాలు నిత్యం నిలిచి ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. కాథలిక్ సమాజానికి ఈ సందర్భంగా ఆయన తన సంతాపాన్ని తెలిపారు. అలాగే చిన్ననాటి నుంచి క్రీస్తు ఆదర్శాలను పోప్ ఫ్రాన్సిస్.. తనను తాను అంకితం చేసుకున్నారని వివరించారు. పేదలు, అణగారిన ప్రజలకు ఆయన సేవలందించారని గుర్తు చేశారు. దేవుని ఆలింగనంలో ఆయన ఆత్మకు శాశ్వత శాంతి లభిస్తుందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 1.4 బిలియన్ల మంది కాథలిక్కులు పోప్ ఫ్రాన్సిస్‌ను ఆరాధిస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది ఇటలీలో జీ7 శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సమావేశం వేదికగా పోప్‌ను ప్రధాని మోదీ కలిసి సంగతి తెలిసిందే. అలాగే పోప్ ఫ్రాన్సిస్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. కాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా (సీబీసీఐ) 2022లో పోప్‌ను భారత్‌కు ఆహ్వానించాలని నిర్ణయించింది. అందుకోసం ప్రధాని మోదీని సంప్రదించింది. వీలైనంత త్వరగా అందుకు ఏర్పాట్లు చేయాలని ప్రధాని మోదీ ఆదేశించారు. కానీ పోప్ ఫ్రాన్సిస్ అనారోగ్యం కారణంగా భారతదేశానికి రాలేకపోయారని సీబీసీఐ అధ్యక్షుడు మార్ ఆండ్రూస్ తఝుత్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. పోప్ ఫ్రాన్సిస్ సోమవారం ఉదయం 7 గంటలకు మృతి చెందారు. ఆయన వయస్సు 88 సంవత్సరాలు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో రోమ్‌లోని జెమెల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించారు.

ఆదివారం జరిగిన ఈస్టర్ వేడుకల్లో సైతం ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు వాటికన్ సిటీ వర్గాలు వెల్లడించాయి. పోప్ ఫ్రాన్సిస్ తన 12 ఏళ్ల వయస్సు నుంచే చర్చి, సమాజం, అట్టడుగు వర్గాల కోసం అంకితభావంతో పని చేశారు. 1936, డిసెంబర్ 17వ తేదీన అర్జెంటీనాలో పోప్ ఫ్రాన్సిస్ జన్మించారు. 2013 మార్చి 13న 266వ పోప్‌గా ఫ్రాన్సిస్ ఎంపికయ్యారు.

**పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల చంద్రబాబు, నారా లోకేశ్ సంతాపం**

ప్రపంచ క్యాథలిక్ పోప్ ఫ్రాన్సిస్ మరణ వార్త పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన వినయపూర్వక ధోరణి, అపారమైన కరుణ,

- తరువాయి 2లో..

## వచ్చే వెయ్యేళ్ల భవిష్యత్ కోసం..


# మా ప్రభుత్వ విధానాలు : ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



న్యూఢిల్లీ : వచ్చే వెయ్యేళ్ల భవిష్యత్‌ను రూపొందించేలా తమ ప్రభుత్వ విధానాలను అమలుచేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం తెలిపారు. సివిల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ భారత దేశపు సమగ్రాభివృద్ధి అంటే ఏ గ్రామం, ఏ కుటుంబం, ఏ పౌరుడు వెనుకబడి ఉండకుండా ఉండటం అని తెలిపారు. ప్రస్తుతం భారత దేశ సమాజంలో యువత, రైతులు, మహిళలు గొప్ప లక్ష్యాలను నిర్ధేసించుకుంటున్నారని అన్నారు. అయితే అసాధారణ లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి, అసాధారణ వేగం అవసరమని మోడీ తెలిపారు. గత 10 ఏళ్లలో భారతదేశం ప్రభావంతమైన పరివర్తన దిశగా సాగుతోందని మోడీ చెప్పారు. సాంకేతిక యుగంలో పాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదని, అవకాశాలను పెంచడం అని మోడీ పేర్కొన్నారు. 2023లో జి20 శిఖరాగ్ర సదస్సును భారత్ విజయవంతంగా నిర్వహించిందని, ప్రపంచం దానిని గుర్తించిందని మోడీ ప్రస్తావించారు. 'భారతదేశం ఇప్పుడు కేవలం పాల్గనడం లేదు. నాయకత్వం వహిస్తోంది' అని మోడీ తెలిపారు. పేదల సమస్యలపై సున్నితంగా ఉండాలని, వారి గొంతును వినాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సివిల్ సర్వీసెస్ అధికారులను మోడీ కోరారు.

# సిట్ విచారణకు హాజరవుతా : రాజ్ కసిరెడ్డి




**అమరావతి ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాజ్ కసిరెడ్డి (కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి) మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన మరో ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల సమయంలో సిట్ విచారణకు హాజరుకావాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మద్యం కుంభకోణం కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గతంలో రాజ్ కసిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం తాజాగా విచారణ చేపట్టింది. మధ్యంతర రక్షణ కల్పించాలంటూ ఆయన తరపు న్యాయవాది కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అయితే, కోర్టు అందుకు సమ్మతించలేదు. తదుపరి విచారణను వారానికి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం తాను విచారణకు హాజరవుతానని రాజ్ కసిరెడ్డి ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇదే కేసులో ఇటీవల విజయసాయిరెడ్డి సిట్ విచారణకు హాజరైన తర్వాత కూడా రాజ్ కసిరెడ్డి ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. విజయసాయిరెడ్డి తనపై తీవ్ర ఆరోపణలు చేశారని, ప్రస్తుతం తన బెయిల్ పిటిషన్ కోర్టులో ఉన్నందున తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదని అన్నారు. మరోవైపు సిట్ అధికారులు ఇప్పటికే మూడు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ.. రాజ్ కసిరెడ్డి విచారణకు హాజరు కాలేదు. తాజాగా న్యాయస్థానంలోనూ అనుకూల తీర్పు రాకపోవడంతో విచారణకు హాజరుకావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

# ఢిల్లీ పయనమైన సీఎం చంద్రబాబు

### యూరప్ పర్యటన నుంచి నేరుగా హస్తిన రాక

### నేడు ఢిల్లీలో పర్యటించనున్న చంద్రబాబు

### కేంద్ర మంత్రులతో భేటీ కానున్న సీఎం

### ఏపీకి సంబంధించిన పెండింగ్ అంశాలపై చర్చ

**అమరావతి ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. తన పుట్టిన రోజు వేడుకల కోసం కుటుంబ సభ్యులతో కలిసి యూరప్ వెళ్లిన చంద్రబాబు ఇవాళ రాత్రికి హస్తిన చేరుకోనున్నారు. చంద్రబాబు రేపు (ఏప్రిల్ 22) ఉదయం 10.30 గంటలకు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశం కానున్నారు. అనంతరం 11.30 గంటలకు కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తో భేటీ అవుతారు. మధ్యాహ్నం 2 గంటలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలవనున్నారు. ఏపీకి సంబంధించిన పెండింగ్ అంశాలు, ఇతర అభివృద్ధి పనులపై చర్చించనున్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై కేంద్ర ప్రభుత్వ సహకారం కోరడమే ఈ భేటీల ముఖ్య ఉద్దేశ్యంగా తెలుస్తోంది.

# కోలుకున్న కొడాలి నాని

### -హైదరాబాద్ ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణ

**అమరావతి ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



మాజీ మంత్రి, వైసీపీ ముఖ్య నేత కొడాలి నాని ఆరోగ్యంపై బిగ్ అప్‌డేట్ వచ్చింది. గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతిలో ఉన్న కొడాలి నాని ఆరోగ్యంపై అప్‌డేట్ ఇచ్చారు ఆయన కుటుంబ సభ్యులు. కొడాలి నాని ఆరోగ్యం కాస్త కుదుటపడిందని ప్రకటించారు. అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకున్నట్లు తెలిపారు. ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నానికి గుండె ఆపరేషన్ నిర్వహించారు. ఆ ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. కొంతకాలం తరువాత ఆయన్న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కూడా ఆ ఆస్పత్రిలోనే నాని ఉన్నారు. హార్ట్ రీహాబిలిటేషన్ తీసుకొంటున్నారని నాని అనుచరులు చెబుతున్నారు.కొడాలి నాని కొద్ది రోజుల క్రితం తన ఇంట్లో ఉండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన్ను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి

- తరువాయి 2లో..

## తిరుమల ఘాట్ రోడ్‌లో

# తీరనున్న ట్రాఫిక్ సమస్యలు

### తిరుమల రద్దీకి చెక్: అలిపిరి బేస్ క్యాంప్ పై టీటీడీ ఫోకస్

**తిరుమల, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తిరుమల కొండపై భక్తుల రద్దీతో పాటు వాహనాల తీవ్ర రద్దీకి చెక్ పెట్టేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యాచరణ ప్రారంభించింది. "టీటీడీ విజన్ 2047?లో భాగంగా, అలిపిరి వద్ద ఆధునిక సదుపాయాలతో కూడిన బేస్ క్యాంప్ నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది. శేషాచల అటవీ ప్రాంతం పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, తిరుమల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అలిపిరిలోని సప్తగిరి తనిఖీ కేంద్రం ద్వారా రోజూ సుమారు 10,000 వాహనాలు తిరుమల కొండపైకి వెళ్తున్నాయి. దీనివల్ల ట్రాఫిక్ సమస్య అధికమవడం, శబ్ద కాలుష్యం పెరగడం, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోంది. వాహనాల హారన్ శబ్దాలతో తిరుమల శాంతి భంగమవుతోంది. తిరుమల పుణ్యక్షేత్రంలో గోవింద నామస్మరణ కన్నా వాహనాల



హోరు ఎక్కువగా వినిపిస్తుండటంతో, దీన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందని టీటీడీ భావిస్తోంది.

%గూ౧జవటీఅంవఎవత్ం

%ముంతాజ్ హోటల్ భూమిలో కొత్త అవకాశాలు

అలిపిరి బేస్ క్యాంప్ నిర్మాణానికి అనువుగా ముంతాజ్ హోటల్స్‌కు కేటాయించబడిన వివాదాస్పద స్థలాన్ని ప్రభుత్వం తిరిగి స్వాధీనం

- తరువాయి 2లో..

# విజయసాయిరెడ్డి రీ ఎంట్రీ

### బీజేపీలోకి చేరికకు ఏర్పాట్లు?

### నేడు అమిత్ షాతో చంద్రబాబు భేటీలో విజయసాయి అంశంపైనా చర్చ



**అమరావతి ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాజ్యసభ మాజీ సభ్యులు వేణుబాకం విజయసాయిరెడ్డి రాజకీయాలలోకి రీ ఎంట్రీ ఇస్తున్నారు. త్వరలోనే ఆయన భారతీయ జనతా పార్టీలో చేరుతున్నట్లు తాజా రాజకీయ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. విజయసాయి రాజకీయ భవితవ్యంపై మంగళవారం నాడు ఢిల్లీలో కొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకోనున్నాయి. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో ఏ-2 నిందితునిగా ఉన్న విజయసాయి వైసీపీలో ఒకప్పుడు నెంబర్ -2 గా చలామణి అయ్యారు. వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, రాజ్యసభ సభ్యునిగా, వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా, ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇంచార్జిగా ఆయన కీలక పాత్ర పోషించారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కేంద్ర, రాష్ట్ర

- తరువాయి 2లో..

# జగన్ జిల్లా పర్యటనకు ఏర్పాట్లు

### నేడు జగన్ అత్యంత కీలక సమావేశం

### పార్టీ బలోపేతం కోసం కీలక నిర్ణయాలు

**అమరావతి ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల్లో ఓటమి అనంతరం తన రూటును పూర్తిగా మార్చుకున్నారు. 2024 ఎన్నికల్లో పరాజయం తరువాత కేవలం 11 సీట్లకు పరిమితం కావడం జగన్‌ను ఆత్మవిశ్లేషణ చేసుకునేలా చేసింది. పొరపాట్లు ఎక్కడ జరిగాయో అర్థం చేసుకొని, వాటిని సరిదిద్దుకునే ప్రక్రియను ప్రారంభించారు. అందులో భాగంగా, పార్టీ కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి జిల్లాల పర్యటనలు నిర్వహించాలని జగన్ డిసైడ్ అయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా, ప్రజలలో ఉన్న వ్యతిరేకతను వివరించడం, కార్యకర్తలతో మమేకమవడం మొదలైన అంశాలపై ఆయన ఫోకస్ పెంచారు. జగన్ తాజా నిర్ణయాల్లో భాగంగా, రెండు రోజులపాటు వరుసగా పార్టీ పొలిట్బ్యూరో (%గూాజ%) సభ్యులు, ప్రాంతీయ సమన్వయకర్తలతో కీలక భేటీలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో పార్టీని గ్రామస్థాయిలో నుంచి బలోపేతం చేయడం, కార్యకర్తలతో నేరుగా మమేకం కావడం, ప్రభుత్వం పై ప్రజల నమ్మకం పెంపొందించడం వంటి అంశాలపై సమీక్ష జరగనుంది. అంతేకాదు, ప్రతి కార్యకర్తకు విశ్వాసం కల్పిస్తూ, పార్టీ పునర్నిర్మాణానికి అవసరమైన మార్గదర్శకాలను నిర్ణయించనున్నారు. ఇప్పటికే పీఏసీ తో పాటు అనుబంధ

- తరువాయి 2లో..

https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## వినోదం.. విజ్ఞానం..

వేసవి సెలవులు మళ్లీ వచ్చాయి. దాదాపు రెండు మూడు దశాబ్దాల క్రితం అయితే, ఎంత గొప్పగానో వుండేవి. వేసవి సెలవుల కోసం పిల్లలు, పెద్దలూ వేయి కళ్లతో ఎదురుచూసేవారు. గ్రామాల్లో వుండేవారు పట్టణాలకు, పట్టణాల్లో వుండేవారు గ్రామాల్లోని అమ్మమ్మ, నాయనమ్మల ఇళ్లకు వెళ్లేందుకు ఎంతో ఉత్సుకతతో వుండేవారు. వేసవి సెలవులు పిల్లలకు ఆహ్లాదకర సమయం. వేడి గాలులు వీస్తున్నా, స్నేహితులతో ఆడుకోవడం, కొత్త ప్రదేశాలు చూడటం, కొత్తకొత్త ఆహార పదార్థాలను రుచి చూడటం మహా సరదాగా వుంటుంది. వేసవి సెలవులు పిల్లలకు అతి పెద్ద ఆటవిడుపుగా, మనోల్లాస వేదికలుగా వుంటాయి. కాలంతో పాటు జీవన విధానంలోను, బాల్యంలోనూ అనేక మార్పులొచ్చాయి. నేటి తరానికి ఆధునిక వేసవి మొక్కుబడిగా మారింది. కొందరు విద్యార్థులకైతే, మామూలు రోజులకూ వేసవి సెలవులకు పెద్ద తేడా కనిపించదు. అయితే ఈ సెలవులను కేవలం వినోదం కోసమే కాకుండా, వారిలో విజ్ఞాన తృష్ణను పెంచేలా ప్రణాళికలు వేయడం తల్లిదండ్రుల బాధ్యత. వారి స్తోమతకు తగిన విధంగా మార్గదర్శనం చేయడం ఉపాధ్యాయుల వంతు.

'విద్య అనేది జీవితానికి సన్నాహం కాదు, విద్య అంటే జీవితమే' అంటాడు జాన్ డ్యూయీ అనే విద్యావేత్త. నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ. వేసవి సెలవుల్లో పొందే అనుభవాలు, గడించే విజ్ఞానం కూడా విద్యలో భాగమే. ఈ విషయాన్ని ఇప్పటి కార్పొరేట్ చదువులు మరుగుపరుస్తున్నాయి. చాలామంది తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో పిల్లలను వివిధ కోచింగ్ సెంటర్లకు తరిమేస్తుంటారు. కేవలం పరీక్షలు, ర్యాంకుల కోణంలో కాకుండా, నిజమైన లోకజ్ఞానం కూడా అవసరమే. పిల్లల ఆసక్తి మేరకు సైన్స్ మ్యూజియంలు, ప్లానిటోరియంలకు తీసుకెళ్లడం, చారిత్రక ప్రదేశాలను చూపడం గొప్ప అనుభవం, విజ్ఞానదాయం కూడా. సమకాలీన అంశాలపై పట్టు సాధించేందుకు పుస్తకం, దినపత్రికల పఠనం, గ్రంథాలయాలకు వెళ్లడం ఎంతగానో దోహదపడతాయి. మొబైల్ ఫోన్లకు అలవాటు పడిన పిల్లలు ఇతర పుస్తకాలు చదవడం ఎప్పుడో మర్చిపోయారు. నాలుగు గోడల మధ్య పాఠ్యాంశాలను వల్లెవేసే పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేస్తే%ఔ% ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవడంతో పాటు%ఔ% భాష, భావాల వెల్లడిలో సృజనకారులుగా తయారవుతారు. కంప్యూటర్ విద్యకు అలవాటు పడిన పిల్లలు అందమైన చేతిరాతను కూడా మర్చిపోతున్నారు. గతంలో సెలవుల్లో స్నేహితులకు రంగురంగుల కాగితాలపై నిండుగా, అందమైన అక్షరాలతో ఉత్తరాలు రాసే అలవాటుండేది. ఇప్పుడా అలవాటు పూర్తిగా కనుమరుగైపోయింది.

మనిషికైనా, సమాజానికైనా మార్పు, ఆధునిక జీవన విధానం అవసరమే. అయితే, అది భవిష్యత్ను అంధకారం చేసేదిగా వుండకూడదు. తాము చదవలేని చదువులు, తాము చేయలేని ఉద్యోగాలు తమ పిల్లల ద్వారా సాధించుకోవాలనుకునే తల్లిదండ్రుల కలలు, విద్యను వ్యాపారంగా మార్చేసిన కార్పొరేట్ విద్యాసంస్థలు, వీటికి కొమ్ముగాస్తున్న ప్రభుత్వాలు%ఔ% అన్నీ కలిసి పిల్లల అందమైన భవితను చిదిమేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. లేలేత సూర్యకిరణాలు ముఖం మీద పడుతుంటే కళ్లు నులుముకుంటూ నిద్రలేచే బాల్యం%ఔ% ఎప్పుడో కనుమరుగైంది. తెల్లవారకముందే మోయలేనంత పుస్తకాల సంచులను భుజానేసుకుని పరుగులెత్తే బాల్యమే ఇప్పుడు మనకు దర్శనమిస్తుంది. 'పిల్లల మనసు ఒక తెల్లకాగితం లాంటిది. మనం దానిపై మంచి విషయాలు రాయాలి' అంటారు రవీంద్రనాథ్ టాగోర్. పిల్లల మనసులను సృజనాత్మకంగా వికసింపజేయడానికి వేసవి సెలవులు చక్కని అవకాశం. విజ్ఞానాన్ని, నైపుణ్యాలను అలవర్చుకునే అవకాశాన్ని కల్పించడం తల్లిదండ్రుల బాధ్యత. మంచి పుస్తకాలు చదివే అలవాటును, ప్రకృతితో మమేకం కావడాన్ని పిల్లలకు నేర్పించాలి. తద్వారా పర్యావరణ స్పృహ అలవడుతుంది. అదే సమయంలో సాంకేతిక విజ్ఞానాన్నీ నేర్చుకోవాలి. అది పిల్లల విజ్ఞానాన్ని, భాషా నైపుణ్యాన్ని మరింత విస్తృతం చేస్తుంది. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి కళలతో పాటు క్రీడలు మానసిక వికాసాన్నిస్తాయి. పిల్లలు పాఠ్యాంశాల ఒత్తిడిని పక్కన పెట్టి, ఈ వేసవి సెలవులను వినోదాత్మకంగా, విజ్ఞానదాయకంగా గడపాలి.

## ఈసీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

**న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల వ్యవస్థ రాజీ పడినట్లు కనిపిస్తోందని, ఆ వ్యవస్థలోనే ఏదో తప్పు ఉందంటూ వ్యాఖ్యానించారాయన. ఈ క్రమంలో మహారాష్ట్ర ఎన్నికల ప్రస్తావ-ననూ ఆయన తీసుకొచ్చారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ.. ఆదివారం బోస్టన్‌లో ప్రవాస భారతీయులు పాల్గొన్న ఓ కార్యక్రమంలో ప్రసంగించారు.**



"ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల్లో 5.30 గంటల నుంచి 7.30 గంటల మధ్య 65 లక్షల మంది ఓటు వేసినట్లు ఎన్నికల సంఘం చెప్పింది. ఒక్కో ఓటర్ ఓటు వేయడానికి 3 నిమిషాల సమయం పడుతుంది. అలాంటప్పుడు అంత తక్కువ వ్యవధిలో అంతమంది ఎలా ఓటు వేయగలరు?. అక్కడ ఏదో తప్పు జరిగిందని స్పష్టంగా తెలుస్తోంది" అని రాహుల్ అన్నారు. "ఎన్నికల సంఘం రాజీ పడినట్లు ఇక్కడే అర్థమవుతోంది. ఆ వ్యవస్థలోనే ఏదో తప్పిదం ఉంది. ఇదే విషయాన్ని నేను చాలాసార్లు ప్రస్తావించాను. మహా ఎన్నికలకు సంబంధించిన వీడియోలు చూపించాలని మేం అడిగాం. అందుకు ఈసీ తిరస్కరించింది. ఇప్పుడు అలా అడగడానికి వీలు లేదంటూ చట్టాన్ని కూడా మార్చేశారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే వేదికగా ఆయన అమెరికా భారత్ మధ్య సంబంధాల గురించి కూడా మాట్లాడారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్.. సోమవారం బ్రౌన్ యూనివర్సిటీలో ప్రసంగించనున్నారు.

ఇదిలా ఉంటే.. రాహుల్ గాంధీ ఈసీపై ఈ తరహా ఆరోపణలు చేయడం ఇదే తొలిసారి కాదు. అయితే.. రాహుల్ సహా పలువురు ప్రతిపక్ష నేతలు చేస్తున్న ఆరోపణలను ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు ఖండిస్తూ వస్తోంది. మరీ ముఖ్యంగా ఈవీఎంలను మేనేజ్ చేయొచ్చనే ఆరోపణలను కూడా తోసిపుచ్చుతూ వస్తోంది. అయినప్పటికీ వరుసగా ఆయా రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు, ఓటర్ల జాబితాల ఆధారంగా ప్రతిపక్షాలు ఈసీపై విమర్శలు గుప్పిస్తూనే ఉన్నాయి.

## ఏపీ, తెలంగాణ హైకోర్టుల న్యాయమూర్తుల బదిలీ



న్యూఢిల్లీ ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ, తెలంగాణ హైకోర్టుల న్యాయమూర్తుల బదిలీ జరిగింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేందర్ మద్రాస్ హైకోర్టుకు.. జస్టిస్ పి.శ్రీసుధ కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావును కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేశారు.

## పోప్ ఫ్రాన్సిస్ మృతి

మానవత్వాన్ని ఆలంబన చేసుకున్న జీవన విధానం ద్వారా పోప్ ఫ్రాన్సిస్ అనేకమందికి స్ఫూర్తి ఇచ్చారని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, పోప్ ఫ్రాన్సిస్ మరణం తనను ఎంతో బాధించిందని వెల్లడించారు. ఆయన జీవితం, సందేశాలు ప్రపంచంలోని ప్రతి మూలన ఉన్న మానవాళిని ప్రేమ, దయతో ముందుకు నడిపించాయని సీఎం కొనియాడారు. పోప్ తన జీవితాంతం శాంతి, సామరస్యం, సామాజిక న్యాయం పట్ల నిబద్ధతతో నిలబడి ఎంతోమందికి ఆదర్శప్రాయంగా నిలిచారని అన్నారు. ఈ విషయంలో మంత్రి నారా లోకేశ్ కూడా తన స్పందనను తెలియజేశారు. పోప్ ఫ్రాన్సిస్ తరతరాలకూ స్ఫూర్తిగా నిలిచారని లోకేశ్ గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను స్పృశించిన మహోన్నత వ్యక్తిత్వం పోప్ ఫ్రాన్సిస్‌దని అన్నారు. ఆయన జీవితంలో ప్రతీ క్షణం, ప్రతి చర్య మానవత్వానికి నిలువెత్తు నిర్వచనంగా నిలిచిందని, స్త్రీ–పురుష సమానత్వం, పేదల హితం, శాంతి స్థాపన కోసం పోప్ చేసిన కృషి అజరామరమని కొనియాడారు. పోప్ ఫ్రాన్సిస్ చూపిన మార్గం ప్రతి ఒక్కరికి జీవన పాఠాలుగా నిలుస్తుందని లోకేశ్ వ్యాఖ్యానించారు. ఈ విపరీతమైన లోటును తీర్చలేమని, కానీ ఆయన చూపించిన మార్గంలో కొనసాగడమే నిజమైన నివాళి అవుతుందని అన్నారు.

**పోప్ ఫ్రాన్సిస్ మృతిపై జగన్ స్పందన**

ప్రపంచ ఖ్యాతి గల క్రైస్తవ మతగురు పోప్ ఫ్రాన్సిస్ మృతి వార్తను తెలుసుకుని కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఆయన మరణవార్త తనను ఎంతో కలచివేసిందని భావోద్వేగంతో తెలిపారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేసిన జగన్, పోప్ ఫ్రాన్సిస్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే వ్యక్తి అని పేర్కొన్నారు. కేవలం మతపరమైన నాయకుడిగా మాత్రమే కాకుండా, ఆయన నిజమైన మానవతావాది అని కొనియాడారు. ప్రపంచంలోని పేదల కోసం పోప్ పోరాడిన విధానం స్ఫూర్తిదాయకమని అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ తన హయాంలో చర్చిలో అనేక మార్పులకు నాంది పలికారని జగన్ చెప్పారు. కోట్లాది క్రైస్తవ విశ్వాసుల మనసుల్లో ఆయన తనదైన ముద్ర వేసినట్టు తెలిపారు. పోప్ తన విధానాల్లో వినయం, కరుణకు పెద్దపీట వేసినట్లు జగన్ కొనియాడారు. లాటిన్ అమెరికా నుంచి పోప్ పదవికి ఎంపికైన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించిన వ్యక్తి పోప్ ఫ్రాన్సిస్. ఈ విషయాన్ని జగన్ ప్రత్యేకంగా గుర్తు చేశారు. మతపరమైన పరిమితులను దాటి, ప్రపంచ శాంతి కోసం పాటుపడిన గొప్ప నాయకుడు అని పేర్కొన్నారు. పోప్ ఫ్రాన్సిస్ జీవితమంతా అణగారిన వర్గాలకు అండగా నిలవడమే ధ్యేయంగా పెట్టుకున్నారని జగన్ అన్నారు. ఆయన ఆశయాలు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచాయని అభిప్రాయపడ్డారు. కరుణ, సహనంతో కూడిన ఆయన మాటలు కోట్లాదిమందికి శాంతిని అందించాయన్నారు. ప్రతి మాట, ప్రతి చర్యలో మానవత్వం వెల్లివిరిచిందని జగన్ కొనియాడారు. ప్రజలకు సేవ చేయాలనే తపన ఆయన వ్యక్తిత్వాన్ని గట్టి చూపించిందని గుర్తు చేశారు. పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాంతి చేకూరాలని తాను ప్రార్థిస్తున్నట్లు జగన్ తెలిపారు. ప్రపంచం ఒక్క గొప్ప నేతను కోల్పోయిందని, ఈ లోటు భర్తీ అయ్యేది కాదని అన్నారు. ప్రత్యేకించి క్యాథలిక్ సమాజానికి ఇది తీరనిలోటు అని జగన్ తేల్చిచెప్పారు. ఆయన జీవితం నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సింది చాలా ఉందని జగన్ అన్నారు. పోప్ ఆశయాలు, ఆయన విన్నప స్వభావం, సేవాభావం ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు..

## కోలుకున్న కొడాలి నాని

తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించగా.. గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్లు తేల్చారు. ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. అయితే, ఇప్పుడే ఆ అవసరం లేదని.. కొంత కాలం ఆగిన తరువాత కూడా చేయించుకోవచ్చని వైద్యులు తెలిపారు. దీంతో నాని.. తన ఇంటికి వచ్చేశారు. ఇంటికొచ్చాక మళ్లీ అదే పరిస్థితి ఎదురవ్వడంతో.. ముంబైలోని ప్రముఖ ఆస్పత్రిలో నాని చూపించుకున్నారు. అన్ని పరీక్షలు చేసిన వైద్యులు ఆయనకు ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆ వెంటనే నానికి ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ సక్సెస్ అయింది. కొన్ని రోజుల తరువాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన కొడాలి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ రీహాబిలిటేషన్ సెంటర్‌లో ఉన్నారు. కొడాలి నాని ప్రస్తుతం కోలుకున్నారని, త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో ప్రజల ముందుకు తిరిగొస్తారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

## తిరుమల ఘాట్ రోడ్‌లో తీరనున్న ట్రాఫిక్ సమస్యలు

చేసుకోవడం ద్వారా, టీటీడీకి ఒక గొప్ప అవకాశం లభించింది. ఈ స్థలంలో 15 హెక్టార్ల విస్తీర్ణంలో బేస్ క్యాంప్ నిర్మించాలన్న పక్కా ప్లాన్ సిద్ధమైంది. ఈ క్యాంప్‌లో పార్కింగ్, వసతి, ఇతర భక్తుల అవసరాలకు తగిన అన్ని సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానుంది. భవిష్యత్తులో భక్తుల రద్దీ మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్న టీటీడీ, తిరుమలలో వసతి సౌకర్యాలు మరింత కష్టంగా మారతాయని ముందుగానే పసిగట్టి ఈ ప్రణాళికలు సిద్ధం చేసింది.

**భవిష్యత్తు రద్దీకి ముందస్తు చర్యలు**

గత కొన్ని దశాబ్దాల్లో తిరుమల భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. 1970లలో సంవత్సరానికి 35 లక్షల భక్తులు మాత్రమే వచ్చేవారు. కానీ ఇప్పుడు ప్రతిరోజు సగటున 70,000 నుండి 80,000 వరకు భక్తులు దర్శనార్థం వస్తున్నారు. 2024 సంవత్సరానికి ఈ సంఖ్య 2 కోట్ల 55 లక్షల భక్తులకు చేరింది. సెలవు దినాలు, పర్వదినాల్లో ఈ సంఖ్య 90 వేల దాకా పెరుగుతోంది. అయితే తిరుమలలో ఉన్న వసతి సౌకర్యాలు కేవలం 40 వేల మంది భక్తులకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అంటే దాదాపు సగానికి పైగా భక్తులకు గది సౌకర్యం అందడం కష్టమవుతోంది. భవిష్యత్తులో తిరుమలలో మరింత గదులు నిర్మించాలంటే అడవులను నరికి కాంక్రీట్ జంగిల్‌గా మార్చాల్సిన పరిస్థితి వస్తుందని టీటీడీ అంచనా వేసింది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని అలిపిరిలోనే భక్తుల ప్రవాహాన్ని నియంత్రించాలని నిర్ణయించింది.

**అలిపిరి బేస్ క్యాంప్ లక్ష్యాలు**

అలిపిరి బేస్ క్యాంప్ ద్వారా రోజూ తిరుమలకు చేరే 25,000 మంది భక్తులకు అన్ని రకాల సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో టీటీడీ పని చేస్తోంది. పార్కింగ్, వసతి గదులు, లాకర్లు, భోజన సదుపాయాలు, విశ్రాంతి ప్రాంతాలు వంటి ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తేనుంది. అలాగే కొండపైకి భక్తుల సంఖ్యను నియంత్రించేందుకు అలిపిరిలోనే ముందస్తు స్క్రీనింగ్, టోకెన్లు ఇచ్చే వ్యవస్థను అభివృద్ధి చేయనుంది. పర్యావరణానికి హాని లేకుండా, భక్తుల సౌకర్యాన్ని పెంచే దిశగా టీటీడీ ముందడుగు వేసింది.

## విజయసాయిరెడ్డి రీ ఎంట్రీ

### బీజేపీలోకి చేరికకు ఏర్పాట్లు?

ప్రభుత్వాల మధ్య విజయసాయి అనుసంధానకర్తగా వ్యవహరించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాలతో ఆయన ఎంతో సన్నిహితంగా మెలిగే వారు. ఆ సాన్నిహిత్యమే జగన్మోహన్ రెడ్డిపై ఉన్న సిబిఐ, ఇడి కేసుల విచారణలో నత్తనడకకు కారణంగా ఇప్పటికీ ఆరోపణలు ఉన్నాయి. అయితే రాష్ట్రంలో వైసీపీ ఘోర పరాజయం తరువాత ఆ పార్టీలో అనూహ్యంగా విజయసాయి ప్రాభవం దిగజారింది. సజ్జల రామకృష్ణా రెడ్డి పెత్తనం పెరిగింది. జగన్ చుట్టూ సజ్జల కోటరీ జట్టు కట్టడంతో వైసీపీలో నెంబర్ 2 స్థానం నుండి 2000 స్థానంలోకి తన స్థాయి పడిపోయిందని విజయసాయి కొన్ని ఇంటర్వ్యూలలో చెప్పుకున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే పూలమ్మిన చోట కట్టెలు అమ్మలేము అన్న భావనతో ఈ ఏడాది జనవరి 25వ తేదీన విజయసాయి వైసీపీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన క్రియాశీల రాజకీయాలకు కూడా గుడ్ బై చెప్పారు. ఇకపై వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించారు. గత నాలుగు నెలలుగా ఆయన రాజకీయ వ్యవహారాలకు దూరంగా ఉన్నట్లు చెబుతున్నప్పటికి బిజెపితో తెర వెనుక మంత్రాంగం సాగిస్తూనే ఉన్నారు. వృత్తిరీత్యా ఆడిటర్, ఆ తరువాత వైసీపీ కీలక నేతగా, మాజీ సిఎం జగన్ సన్నిహితునిగా విజయసాయికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణాతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలోను సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ సంబంధాలను ఉపయోగించి దక్షిణాదిన బిజెపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని విజయసాయి బిజెపి పెద్దల వద్ద ప్రతిపాదన పెట్టినట్లు తెలిసింది. బీజేపీలో జాతీయ కార్యదర్శిగా అవకాశం ఇచ్చి తమిళనాడు ఇంచార్జిగా బాధ్యతలు అప్పగిస్తే పూర్తి స్థాయిలో పని చేస్తానని విజయసాయి బిజెపి పెద్దలకు చెప్పినట్లు సమాచారం.

**రాజ్యసభ ఖాళీ ఎవరితో భర్తీ?**

విజయసాయి రెడ్డిని బీజేపీలో చేర్చుకుని కీలక బాధ్యతలు అప్పగించే విషయంలో ఆ పార్టీలో చర్చోపచర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆయనకు ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా జరుగుతుందని సమాచారం. ఇతర పార్టీ నుండి వచ్చే వారికి ఎలా అవకాశం ఇస్తామని కొందరు నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా గతంలో అధ్యక్షులుగా పని చేసిన కన్నా లక్ష్మీనారాయణ, ప్రస్తుత అధ్యక్షురాలు పురందేశ్వరి కూడా ఇతర పార్టీల నుండి వచ్చి అధ్యక్షులు కాలేదా? అని కొందరు గుర్తు చేస్తున్నారట. ఏది ఏమైనా విజయసాయి రెడ్డి బీజేపీలో చేరడం, ఆయనకు ఆ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించడం ఖాయమని కమలనాథులు చెబుతున్నారు. ఇదే సమయంలో విజయసాయి సాయి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ సభ్యత్వం పైనా చర్చ జరుగుతుంది. ఈ ఖాళీ భర్తీ చేయడానికి ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడింది. ఈ నెల 29వ తేదీ నామినేషన్ దాఖలుకు తుది గడువు. ఈ నేపథ్యంలో ఈ పదవి ఎవరి ఖాతాలో పడుతుందనే ఆసక్తి నెలకొంది. వైసీపీకి తగిన బలం లేనందున ఆ పార్టీ పోటీ పడే పరిస్థితి లేదు. కూటమికే ఈ రాజ్యసభ ఏకగ్రీవంగా దక్కడం ఖాయం. టిడిపి, బిజెపిలలో ఎవరు ఈ పదవి తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. అసెంబ్లీలో బలం ప్రకారం ఈ రాజ్యసభ ఖాళీ టిడిపికే దక్కాల్సి ఉన్నప్పటికే తమ ప్రమేయంతో విజయసాయి రాజీనామా చేసినందున ఈ పదవిని బిజెపి తీసుకునే అవకాశం లేకపోలేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. విదేశీ పర్యటనకు వెళ్లిన ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం అర్ధరాత్రి ఢిల్లీ చేరుకుంటున్నారు. మంగళవారం నాడు ఆయన కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ స్థానం భర్తీ అంశంపై వారిద్దరి మధ్య చర్చ జరగనుంది. తాను రాజ్యసభ రేసులో లేనని విజయసాయి రెడ్డి చెబుతున్నప్పటికే బిజెపి ఆయనకు అవకాశం ఇచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

## జగన్ జిల్లా పర్యటనకు ఏర్పాట్లు

కమిటీలను కూడా ఖరారు చేశారు. ఇక నుంచి ప్రతీ చిన్న మార్పు కూడా కార్యకర్తల నడుమ విశ్వాసాన్ని పెంపొందించేలా ఉండనుంది.

**సభ్యత్వ నమోదు %-% ఆరోగ్య భీమా: వైసీపీలో సంచలనాత్మక నిర్ణయం**

ఈ సమావేశాల్లో మరో కీలక నిర్ణయం కూడా తీసుకోబోతున్నారు. చాలా కాలంగా కొంతమంది సీనియర్‌లు సూచించిన పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను జగన్ ఇప్పటికి ప్రారంభించేందుకు సన్నద్ధమయ్యారు. సభ్యత్వం తీసుకునే ప్రతి కార్యకర్తకు ఆరోగ్య భీమా సదుపాయం కల్పించాలని నిర్ణయించారు. ఇది ఇతర పార్టీల కంటే మెరుగైన మొత్తంలో ఉండాలని, అందుకు సంబంధించిన సభ్యత్వ రుసుము, భీమా కవరేజ్ అంశాలను రేపు జరిగే పీఏసీ సమావేశంలో చర్చించి తుది ఆమోదం పొందనున్నారు. ఇదే సందర్భంలో, జగన్ పార్టీ ప్లీనరీ నిర్వహణపైనా ఆలోచిస్తున్నారు. ఓటమి తరువాత కార్యకర్తలలో ఏర్పడిన నిస్పృహను తొలగించేందుకు, తిరిగి ఉత్సాహం నింపేందుకు ప్లీనరీను ఒక శక్తివంతమైన వేదికగా ఉపయోగించాలనుకుంటున్నారు.

**జిల్లాల పర్యటనలు %-% ప్లీనరీ ద్వారా కొత్త దిశా నిర్దేశం**

జగన్ ప్రస్తుతం వారానికి మూడు రోజులు మాత్రమే తాడేపల్లిలో అందుబాటులో ఉంటూ, మిగిలిన రోజులు బెంగళూరులో గడుపుతున్నారు. అయితే, జూలై 8, 9 తేదీల్లో ప్లీనరీ నిర్వహణ ద్వారా పార్టీ కార్యకలాపాలకు కొత్త ఉత్సాహం ఇచ్చేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. కడపలో టీడీపీ మహానాడు జరగబోతుండటంతో, వైసీపీ ప్లీనరీను గోదావరి జిల్లాల్లో నిర్వహించాలనే ఆలోచన చేస్తున్నారు. దీనిద్వారా పార్టీని మళ్లీ పునర్నిర్మించడమే కాకుండా, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ రెండు రోజుల సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలు, జగన్ తీసుకునే అనూహ్య నిర్ణయాలు ప్రస్తుతం వైసీపీ శ్రేణుల్లో ఎంతో ఆసక్తిని కలిగిస్తున్నాయి.

తెలుగురాష్ట్రం దినపత్రిక

జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

అమలాపురం
ఏప్రిల్ 22,
మంగళవారం 2025



# అల్లుడొచ్చారు

## అమెరికా వైస్ ప్రెసిడెంట్ ఇండియాకు రాక

న్యూఢిల్లీ ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అమెరికా ఉపాధ్యక్షుడు జేడి వాన్స్ భారత్‌కు చేరుకున్నారు. సోమవారం ఉదయం సతీసమేతంగా వాన్స్ ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అడుగుపెట్టారు. జేడి వాన్స్‌తో పాటు సతీమణి జేడి ఉష, వారి ముగ్గురు చిన్నారులు ఇవాన్, వివేక్, మిరాబెల్ ఇండియాకు వచ్చారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని పాలం విమానాశ్రయంలో జేడి వాన్స్‌కు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఘన స్వాగతం పలికారు. కళాకారులు తమ నృత్యాలతో వాన్స్ ఫ్యామిలీకి వెల్కమ్ చెప్పారు. ఈనెల 24 వరకు భారత్‌లో అమెరికా వైస్ ప్రెసిడెంట్ పర్యటిస్తారు. సతీమణి ఉషా వాన్స్, పిల్లలతో కలిసి వాన్స్ భారత్‌లో పర్యటించనున్నారు. జేడీ వాన్స్ సతీమణి ఉషా వాన్స్ భారత సంతతికి చెందిన వారు. అమెరికా ఉపాధ్యక్ష పదవి చేపట్టిన అనంతరం జేడి వాన్స్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. భారత పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం ప్రధాన



మంత్రి నరేంద్ర మోదీ నివాసానికి జేడి వాన్స్ వెళ్లారు. సాయంత్రం 6:30 గంటలకు ప్రధానితో వాన్స్ సమావేశం అయ్యారు. భారత - అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై మోదీతో వాన్స్ చర్చించారు. చర్చల తర్వాత జేడీ వాన్స్ దంపతులకు ప్రధాని మోదీ విందు ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల భారత పర్యటనలో పలు చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను వాన్స్ దంపతులు సందర్శించనున్నారు. అక్షర్‌ధామ్ ఆలయం, జైపూర్, ఆగ్రా, తాజ్‌మహల్‌ను జేడి దంపతులు సందర్శించనున్నారు. జేడి వాన్స్ పర్యటన సందర్భంగా భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి జేడి బస చేయనున్న హోటల్ వరకు కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. సోమవారం సాయంత్రం స్వామినారాయణ్ అక్షర్‌ధామ్ ఆలయాన్ని జేడి వాన్స్ సందర్శించారు. అనంతరం చేనేత ఉత్పత్తుల దుకాణాలు సందర్శించారు. మంగళవారం జైపూర్‌లోని చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తారు. ఈనెల 23న తాజ్‌మహల్‌ను జేడి దంపతులు సందర్శించనున్నారు. ఈనెల 24న అమెరికాకు జేడి వాన్స్ తిరుగు ప్రయాణంకానున్నారు.

# ఏపీలో మళ్లీ ఠారెత్తిస్తున్న ఎండలు..

## నేడు 51 మండలాల్లో వడగాలులు

విశాఖపట్నం ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మళ్లీ ఠారెత్తిస్తున్నాయి. ఆదివారం నంద్యాల జిల్లా అవుకులో 42.6, వెంకటగిరి (తిరుపతి), నగరి (చిత్తూరు), పునుగోడు (ప్రకాశం)లో 42.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, ఏలూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో వడగాలులు వీచాయి.**

సోమవారం కూడా 31 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 20 మండలాల్లో వడగాలులు వీచే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. మరోవైపు రాబోయే మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశముందని వాతావరణ విభాగం తెలిపింది. ఆదివారం వైఎస్సార్, కర్నూలు, ప్రకాశం, పల్నాడు, నంద్యాల, పార్వతీపురం మన్యం, అన్నమయ్య జిల్లాల్లో పలు చోట్ల వానలు పడ్డాయని పేర్కొంది.



# అలిపిరి నడక దారిలో దివ్యదర్శన టోకెన్ల జారీ ఎప్పుడు?

### వేసవి నేపథ్యంలో పునరుద్ధరించాలంటున్న భక్తులు అలిపిరి కాలినడక మార్గంలో భక్తులు

తిరుమల, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం అలిపిరి మార్గంలో కాలినడకన తిరుమలకు వస్తున్న వారికి గతంలో ఉన్న ప్రయోజనాలను పునరుద్ధరించాలని భక్తులు కోరుతున్నారు. వేసవి నేపథ్యంలో రెండు నడకదారుల్లో వచ్చేవారి కోసం దివ్యదర్శనం టోకెన్లు ఇవ్వడంతో పాటు కోటా పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో శ్రీవారి భక్తులకున్న సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా ఒక్కోటి రద్దుచేస్తూ వచ్చారు. కరోనా సాకుతో దివ్యదర్శన టోకెన్ల జారీని నిలిపివేశారు. తదనంతరం పునరుద్ధరిస్తామని చెప్పినప్పటికీ, అలిపిరి నడకదారిలో చిరుత దాడిలో ఓ బాలిక మృతిచెందడంతో ఆ నిర్ణయాన్ని పక్కనపెట్టారు. చంద్రగిరి వైపున ఉన్న శ్రీవారిమెట్టు మార్గంలో 2,100 మెట్లు ఉండగా, గంటన్నరలో తిరుమలకు చేరుకోవచ్చు.



3,650 మెట్లున్న అలిపిరి దారిలో ఆలయాలు, గోపురాలు, లోయలు, కొండలు, ప్రకృతి రమణీయ దృశ్యాలు, జింకల పార్కు, తితిదే ప్రదర్శనశాల వంటివి భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను ప్రోదిచేస్తాయి. తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రతాపరంగానూ ఇటీవల సౌకర్యాలు పెరిగాయి. ఈ మార్గంలో సాధారణ రోజుల్లో సుమారు 8 వేల మంది, రద్దీ సమయంలో 15 వేల మంది నడిచి వస్తున్నా వారికి అదనపు ప్రయోజనాలు కల్పించడం లేదు. గతంలో అలిపిరి నడకదారిలో 14 వేలు, శ్రీవారిమెట్టు మార్గంలో 6 వేల చొప్పున నిత్యం 20 వేల దివ్యదర్శన టోకెన్లు ఇచ్చేవారు. వైకుంఠం క్యూలైన్లలోనూ ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300 టికెట్) కోటా తర్వాత దివ్యదర్శనం భక్తులకు ప్రాధాన్యముండేది. పైగా ఉచిత లడ్డూ ప్రసాదం అందేది.

### ఒక్క మార్గంలోనే.. అవీ అరకొరే!

కొవిడ్ తర్వాత అలిపిరి దారిలో దివ్యదర్శనం టోకెన్ల జారీ రద్దు కాగా, కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో వీటిని పునరుద్ధరిస్తామని తితిదే ప్రకటించింది. గాలిగోపురం వద్ద స్కానింగ్ కేంద్రాన్ని సిద్ధం చేసింది. కారణం వెల్లడించకుండా, ఆ ప్రతిపాదనను పక్కన పెట్టింది. దివ్యదర్శన టోకెన్ల కోసం భక్తులు శ్రీవారి మెట్టుమార్గం వరకూ వెళ్లాల్సి వస్తుంది. దీన్ని కొందరు టాక్సీ, ఆటోడ్రైవర్లు సొమ్ము చేసుకుంటున్నారు.

ఒక్కో భక్తుడి నుంచి రూ.500-1,000 వరకు దండుకుంటున్న వైనంపై చంద్రగిరి ఠాణాలో కేసులు సైతం నమోదయ్యాయి.

అక్కడ కూడా రోజుకు సగటున 3 వేల టోకెన్లు మాత్రమే ఇస్తుండటంతో మధ్యాహ్నం తర్వాత వచ్చిన భక్తులకు అవీ మిగలడం లేదు. వారు అటు తిరుపతిలో టైంస్లాట్ టోకెన్లు తీసుకోలేక, ఇటు మెట్లమార్గంలో దివ్యదర్శనం టోకెన్లూ దక్కించుకోలేక సర్వదర్శనానికి వెళ్లాల్సి వస్తుంది. ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొనడం, వేసవి రద్దీ దృష్ట్యా రెండు మార్గాల్లోనూ దివ్యదర్శనం టోకెన్లు ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు.

# దేశంలో తొలి హైడ్రోజన్ రైలు రెడీ..

### జులై నుంచి పట్టాలపై పరుగులు



న్యూఢిల్లీ ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలు జూలై నుంచి హర్యానాలోని జీంద్ జిల్లాలో పరుగులు తీయనుంది. జీంద్ నుంచి సోనిపత్ మధ్య నడవనుంది. ఈ తొలి తొలి హైడ్రోజన్ రైలు చెన్నైలో సిద్ధమవుతోంది. అయితే హైడ్రోజన్ ప్లాంట్ నిర్మాణం రెండు నెలల్లో పూర్తికానుంది. ఉత్తర రైల్వే జనరల్ మేనేజర్ అశోక్ వర్మ ఆదివారం హైడ్రోజన్ ప్లాంట్ను పరిశీలించారు. చెన్నైలో తయారు చేస్తున్న రైలును జీంద్ కు తీసుకువచ్చాక ట్రయల్ రన్ జరుగుతుందని అశోక్ వర్మ తెలిపారు

# స్టాఫ్ సెలక్షన్ పరీక్షలన్నింటికీ ఇక ఆధార్ బయోమెట్రిక్

న్యూఢిల్లీ ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వంలోని అతిపెద్ద నియామక సంస్థల్లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ) ఒకటి. ఇది ప్రధానంగా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలలో నాన్-గెజిటెడ్ పోస్టులకు ఎంపిక ప్రక్రియలను నిర్వహిస్తుంది. అయితే కమిషన్ తాజా నిర్ణయంతో రాబోయే పరీక్షల్లో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ప్రామాణీకరణను అమలు చేయాలని కమిషన్ నిర్ణయించింది. దీని ప్రకారం ఈ ఏడాది మే నుంచి కమిషన్ నిర్వహించే అన్ని పరీక్షలకు అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ వివరాలను పేర్కొనడంతోపాటు పరీక్ష రోజున పరీక్షా కేంద్రంలో హాజరయ్యేటప్పుడు ఆధార్ బయోమెట్రిక్ కూడా తీసుకుంటారు.

**మోసపూరిత మార్గాలు నిరోధించేందుకు..**

పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ గుర్తింపులను నకిలీ చేయకుండా, ఎస్-ఎస్సీ నియామక పరీక్షలకు హాజరు కావడానికి మోసపూరిత మార్గాలను ఉపయోగించకుండా నిరోధించేందుకు ఆధార్ ఆధారిత ప్రామాణీకరణ సహాయపడుతుందని అధికారులు వివరించారు. అభ్యర్థుల ప్రామాణీకరణ మరింత బలంగా ఉంటుందని కమిషన్ జారీ చేసిన పబ్లిక్ నోటీసులో పేర్కొంది. ఆధార్ ప్రామాణీకరణ స్వచ్ఛందంగానే ఉంటుందని, అభ్యర్థులకు పరీక్షా ప్రక్రియను మరింత సౌకర్యవంతంగా చేయడానికి ఉద్దేశించబడిందని కమిషన్ స్పష్టం చేసింది. గత ఏడాది సెప్టెంబర్ 12న జారీ చేసిన నోటిఫికేషన్‌లో, కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖ స్వచ్ఛంద ప్రాతిపదికన ఆధార్ ప్రామాణీకరణను నిర్వహించడానికి కమిషన్ అనుమతి పొందింది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఏడు రకాలైన అఖిల భారత బహిరంగ పోటీ పరీక్షలను నిర్వహిస్తుంది. గత ఏడాది ఆగస్టు 28న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షలకు ఆధార్ ఆధారిత ప్రామాణీకరణను ఆమోదించిన సమయంలో మంత్రిత్వ శాఖ ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

# బంగారం దూకుడు..

## రూ.లక్షకు చేరువలో పసిడి ధర!



**అమెరికా : అంతర్జాతీయంగా నెలకొన్న డిమాండ్ కారణంగా బంగారం ధరకు మళ్లీ రెక్కలు వస్తున్నాయి. అమెరికా, చైనా మధ్య వాణిజ్య పోరు, డాలర్ బలహీన పడడం వంటి కారణాలతో మదుపర్లు బంగారం వైపు మొగ్గు చూపుతుండడంతో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర పెరుగుతూనే ఉంది.**

దీన్ని అనుసరించి దేశీయంగానూ పసిడి ధర పరుగులు పెడుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.99,600 పైనే పలుకుతోంది. రూ.లక్షకు కాస్త దూరంలో నిలిచింది. అటు వెండి సైతం కిలో రూ.98 వేలుగా ఉంది. అటు మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ 10 గ్రాముల పసిడి తొలిసారి రూ.96వేల మార్కు దాటింది. జూన్ నెల డెలివరీ కాంట్రాక్ట్సులో 10 గ్రాముల పసిడి ఒక్క రోజులోనే రూ.1493 మేర పెరిగి ఇంట్రాడేలో రూ.96,747 వద్ద గరిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు 3,393 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా- చైనాల మధ్య వాణిజ్యం విషయంలో సయోధ్య కుదిరేంతవరకు ఇదే పరిస్థితి కొనసాగొచ్చని అనలిస్టులు చెబుతున్నారు.





డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

మంగళవారం 22 ఏప్రిల్ 2025


## రోడ్డు నిర్మాణ పనులకు

# ఎమ్మెల్యే భూమి పూజ



**ఉప్పలగుప్తం, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామంలో కోటి రూపాయలతో నిర్మించనున్న ఆర్ అండ్ బి రోడ్డు పనులను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి ఇసుకుపట్ల జయమణి రఘుబాబు, అమలాపురం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గోలకోటి చిన్నా, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, దంగేటి బాబ్బులు, సుంకర చిన్నాబాయి, బూసి బుచ్చిదొర, పోలిశెట్టి శివాజీ, పొలిశెట్టి ఉమా, సుంకర రాంబాబు, కుంపట్ల రమేష్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రికి మోకా సన్మానం



**అమలాపురం, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సోమవారం నాడు అమలాపురంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు స్వగృహానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను సుబ్బారావు ఘనంగా సన్మానించారు. మంత్రి వెంట బిజెపి పూర్వపు జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబు, అమ్మడా చైర్మన్ అల్లాడ సోంబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కల గణేష్, టిడిపి నాయకులు గంధం పల్లంరాజు, రేవు శ్రీను, రాయపురెడ్డి రాజా, దున్నాల దుర్గ తదితరులు ఉన్నారు.

## వాడపల్లి వెంకన్న దేవస్థానానికి

# దాతల విరాళాలు



**ఆత్రేయపురం, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించే అన్న ప్రసాద పంపిణీ కార్యక్రమానికి అవసరమైన 500 స్టీలు ప్లేట్లను దాతలు విరాళంగా అందజేసారు. నిడమానూరుకు చెందిన గొంది వెంకట శ్రీనివాసరావు, శకుంతల దంపతులు ఆదివారం వీటిని దేవస్థానం అధికారులకు అందజేసారు. అలాగే పి.గన్నవరం గ్రామానికి చెందిన కట్టా విజయకుమార్, శ్రీలత దంపతులు సోమవారం ఆలయంలో చేపట్టిన వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి రూ.50 వేలు విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, అర్చకులు, సిబ్బంది దాతలకు స్వామి వారి చిత్ర పటాలు, తీర్థ ప్రసాదాలను అందజేసారు.

## వక్ఫ్ సవరణ చట్టాన్ని

# వెనక్కి తీసుకోవాలి

### - రావులపాలెంలో ముస్లింల భారీ ర్యాలీ




**రావులపాలెం, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కేంద్రప్రభుత్వం రూపొందించిన వక్ఫ్ సవరణ చట్టం ముస్లింల వక్ఫ్ భూములను లాక్కునేలా ఉన్నందున ఈ చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా నిరసనలు ఉధృతం చేస్తామని ముస్లిం ఐక్య వేదిక కన్వీనర్ షేక్ అన్సారీ అన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో ముస్లింలు ఆందోళన చేపట్టారు. కొత్తపేట నియోజకవర్గ ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక మసీదు వద్ద నుంచి అధిక సంఖ్యలో ముస్లింలు కోనసీమ ముఖద్వారం మీదుగా రావులపాడు జంక్షన్, అంబేద్కర్ నగర్, మార్కెట్ రోడ్డు మీదుగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగాన్ని రక్షించాలని, దేశాన్ని పరిరక్షించాలని, వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని డిమాండు చేస్తూ తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టికల్ 14,25,28,30 మతసామరస్యానికి, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నందున వెంటనే ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.మేలుకో ఆంధ్ర సభ్యులు థామస్ పల్లి తానం, కమ్యూనిస్టు నేతలు కొండా దుర్గారావు, కారెం వెంకటేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి కర్రి రామిరెడ్డి, ఎంపీజ్ కోశాధికారి వలియా, పార సంస్థ సభ్యులు ఈ ర్యాలీలో పాల్గొని మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లిం మహిళలు, పలు మసీదుల సభ్యులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రదాత చంద్రబాబు

### కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

### రావులపాలెంలో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



**రావులపాలెం, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధే ధ్యాసగా.. తెలుగుదేశం పార్టీయే శ్వాసగా ముందుకు సాగుతున్న దార్శనికుడు, విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలను ఆదివారం రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సత్యానందరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రక్తదాన శిబిరం నిర్వహించి రక్త దాతలకు ప్రశంసా పత్రాలు అందజేసారు. పేదలకు పండ్లు, దుప్పట్లు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ పనితనం, ఆలోచనా విధానంలో నవ యువకుడు చంద్రబాబు అన్నారు. భవిష్యత్తు తరాల అవసరాలను ముందు చూపుతో గుర్తించి అభివృద్ధికి బాటలు వేసే దార్శనికుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడని కొనియాడారు. ప్రపంచ దేశాలు సైతం చంద్రబాబు నాయకత్వాన్ని కొనియాడిన సందర్భాలు ఉన్నాయని అదే ఆయన గొప్పతనం అన్నారు. నాయకుడు అనే పదానికి నిలువెత్తు నిదర్శనం చంద్రబాబు అన్నారు. అభివృద్ధి, సంక్షేమం, యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనలో చంద్రబాబుకు ఎలాంటి పోటీ లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రాన్ని కానీ, విభజిత ఆంధ్రప్రదేశ్ ను కానీ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లింది చంద్రబాబు నాయుడు మాత్రమే అన్నారు చంద్రబాబు వయసు 75 సంవత్సరాలే గాని చంద్రబాబు ఆలోచనా విధానంలో, పనితనంలో నవ యువకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కె.వి. సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, ముదునూరి వెంకటరాజు, పడాల బులి కొండారెడ్డి, జక్కంపూడి వెంకటస్వామి, కేతా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న ఆశీస్సులతో

# 'కోర్టు' సినిమాలో అవకాశం

### చిత్ర హీరోయిన్ శ్రీదేవి - వాడపల్లి వెంకన్నకు ఏడు వారాల మొక్కు



**ఆత్రేయపురం, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఏడు శనివారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో తనకు కోర్టు సినిమాలో అవకాశం లభించిందని, ఆ సినిమా తనకు మంచి పేరు తెచ్చిందని ఆ సినిమా హీరోయిన్ శ్రీదేవి అన్నారు. ఆదివారం ఆమె వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి సినిమాలో హీరోయిన్ గా అవకాశం రావాలని కోరుకుంటూ స్వామి వారి సన్నిధికి ఏడు శనివారాల పాటు వస్తానని మొక్కుకున్నానని, రెండో వారమే తనకు కోర్టు సినిమాలో హీరోయిన్ గా జాబిలి కేరక్టర్ చేసే అవకాశం లభించిందని చెప్పారు. ఆ సినిమా పెద్ద హిట్ అయ్యిందని, తనకు మంచి పేరు తెచ్చిందని ఆనందం వ్యక్తం చేసారు. ఏడు శనివారాల మొక్కు పూర్తి కావడంతో అష్టోత్తర పూజ చేయించుకునేందుకు వచ్చినట్టు తెలిపారు. వాడపల్లి వెంకన్న ఎంతో మహిమ గల స్వామి అని, స్వామిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు

# ఉచిత ఉపకరణాల పంపిణీ



**రావులపాలెం, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రావులపాలెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యేక అవసరాల గల పిల్లలకు పాఠశాల విద్యా శాఖ - సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు ఉపకరణాలను పంపిణీ చేసారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గ పరిధిలో గల 45 మంది పిల్లలకు వినికిడి మిషన్లు, వీల్ చైర్స్, రోలార్డ్ రాడ్, ట్రేడ్ సైకిల్స్ తదితర ఉపకరణాలను అందజేసినట్లు చెప్పారు. పిల్లలకు, వారి తల్లితండ్రులకు భోజనం ఏర్పాటు చేసిన అన్నపూర్ణ సేవ సమితి సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం ఎంపీడీఓ మహేశ్వరరావు, నాలుగు మండలాల విద్యాశాఖాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయురాలి పదవీ విరమణ :**

కొత్తపేట మండలం వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పదవీ విరమణ చేసిన గోరీకృష్ణకు సోమవారం వీడ్కోలు సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయురాలిని ఘనంగా సత్కరించారు.

# గోపాలపురం గ్రామ కార్యదర్శి సాయిరామ్ ఆకస్మిక మృతి

**రావులపాలెం, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



రావులపాలెం మండలం గోపాలపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నిమ్మకాయల సాయిరాం సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన స్వగ్రామం ఆలమూరు మండలం పెదపళ్ళ కాగా ఆలమూరులో నివాసం ఉంటున్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కార్యదర్శిగా సేవలందించారు. జిల్లాలో పంచాయతీ ఉద్యోగులకు ఎలాంటి సమస్య వచ్చిన పరిష్కారం కోసం కృషి చేసే సాయిరాం మృతి చెందడం పట్ల గ్రామ కార్యదర్శులు, ఉద్యోగులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆయన మృతి పట్ల కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కె.వి. సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, ఎంపీడీవో మహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో గంగుల కృష్ణ, రావులపాలెం, ఈతకోట, రావులపాడు, దేవరపల్లి, ఊబలంక, వెదిరేశ్వరం గ్రామ కార్యదర్శులు ఎల్. దుర్గాప్రసాద్, శర్మ, పట్టాభి రామయ్య, మట్టా శ్రీనివాస్, శరభరాజు, డి.రాజు తదితరులు సంతాపం వ్యక్తం చేసారు.

# ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆధ్వర్యంలో అన్ని ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

**ఐ.పోలవరం ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కోరుతూ మురమళ్ళ వీరేశ్వర స్వామికి టిడిపి నాయకులు, కార్యకర్తలు పూజలు చేయించారు. చంద్రబాబు 75 వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా భారీ కేకును కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. నిరంతరం అభివృద్ధికి పాటుపడే వ్యక్తి, రాష్ట్ర ప్రజల భవిష్యత్తును ముందుగానే ఊహించి అందుకు అనుగుణంగా సమర్థవంతమైన పాలన సాగించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిట్ట అని ప్రముఖులు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరేశ్వర స్వామికి పంచమృతాభిషేకం, కళ్యాణం జరిపించి, చంద్రబాబు సంపూర్ణ ఆయుష్ తో ఉండాలని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జంపన బాబు, ఏలూరి మూర్తి, గంజా సుధాకర్, రాయపురెడ్డి మాణిక్యం, పలివేల త్రినాథ్, గంజా శ్రీను, పితాని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



## జిజిహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ పి ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐసోలేషన్ వార్డును పరిశీలించిన, అనంతరం మాతా శిశు సంరక్షణ వార్డు, క్రిటికల్ కేర్ బ్లాక్ పనులు పురోగతిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎమ్ లక్ష్మీ సూర్య ప్రభను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఐసోలేషన్ వార్డును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకుని రావాలని ఆదేశించారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ వార్డును తగిన వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే మాతా శిశు ఆరోగ్య బ్లాక్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గత సమావేశంలో స్పష్టం చేశామన్నారు. 15 రోజుల్లో ఎమ్‌సిహెచ్ బ్లాక్ ద్వారా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ బోధన ఆసుపత్రికి అనుసంధానంగా క్రిటికల్ కేర్ బ్లాక్ ద్వారా ప్రజలకి అత్యవసర వైద్య సేవలు అందించే విధంగా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రోగులకి అందచేస్తున్న వివిధ రకాల వైద్య సేవలు, మానవ వనరులు వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటించాలని ఆదేశించారు.

## పేదల ఆకలి తీరుస్తున్న అన్నా కేంటిన్‌లు

### అన్నా క్యాంటీన్ లో భోజనం చేసిన జిల్లా ఇంచార్జీ మంత్రి నిమ్మల



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలలో భాగంగా పునరుద్దరించిన అన్నా కేంటిన్‌లో ఎంతోమండి పేదవారి వారి ఆకలి తీరుస్తుందని జిల్లా ఇంచార్జీ మంత్రి, రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి డా నిమ్మల రామా నాయుడు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గల అన్నా క్యాంటీన్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి ఐదు సంతకాలలో ఒకటిగా రాష్ట్ర వ్యాప్తంగా 250 అన్నా క్యాంటీన్‌లు తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. కేవలం 15 రూపాయలతో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం మూడు పూటల కడుపు నిండా భోజనం చేయడం జరుగుతోందనీ ప్రజలు చెప్పడం జరిగిందని తెలిపారు. ఇంటిలో కంటే మెరుగ్గా రుచికరంగా, వేడి వేడి గా ఇక్కడ ఆహారం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వివిధ పనులు నిమిత్తం, ఆరోగ్య సమస్యల పరిష్కార కోసం ఆసుపత్రులకు వొచ్చే వారు, చదువుకునే విద్యార్థులు పలువురు అన్నా క్యాంటీన్‌కు రావడం చూసామన్నారు. గత ప్రభుత్వ అధికారంలో 2019లో అన్న క్యాంటీన్లను రద్దు చేయడం దుర్మార్గమైన చర్యగా మంత్రి పేర్కొన్నారు. ఆనాడు పాలకొల్లులో అన్నా క్యాంటీన్లు మూసివేసిన రోజునే తాను తన సొంత డబ్బులతో అన్నా క్యాంటీన్లను నిర్మించామని తెలిపారు. అదేవిధంగా ఆదిరెడ్డి శ్రీనివాసు నేతృత్వంలో రాజమండ్రిలో కూడా అన్న క్యాంటీన్ నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. మంత్రి వెంట శాసనసభ్యులు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, మజ్జి రాంబాబు తదితరులు ఉన్నారు.

## సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీవమ్ అద్భుతం

### అతిక్రమణలకు ఎల్‌టిపిలను బాధ్యులను చేయొద్దు

### ఎల్‌టిపి అసోసియేషన్ ప్రతినిధులు వినతి



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భవన నిర్మాణాల ప్లానులు పొందడంలో జాప్యాన్ని నివారించి, త్వరితగతిన ప్లాన్‌లు మంజూరు చేసే నిమిత్తం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మున్సిపల్ శాఖ ద్వారా జిఓ 20 ద్వారా తీసుకువచ్చిన సెల్ఫ్ షర్టిఫికేషన్ స్కీమ్ అద్భుతంగా ఉందని రాజమహేంద్రవరం ఎల్‌టిపి అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌ఎన్‌విఎస్‌ఎస్ మూర్తి పేర్కొన్నారు. అయితే ఈ జిఓలో భవన నిర్మాణంలో అతిక్రమణలు జరిగితే ఎల్‌టిపిను బాధ్యతులను చేసే క్లాజ్ ఎల్‌టిపిలను తీవ్రంగా ఇబ్బంది కలిగించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో మూర్తి మాట్లాడుతూ ఎల్‌టిపిలను ప్లాన్ అప్రూవల్ వరకే పరిమితం చేయాలని అతేతప్ప భవన నిర్మాణంలో అతిక్రమణలు ఉంటే వారి లైసెన్స్‌లు ఐదేళ్ళపాటు కేన్సిల్ చేయడం అనేది సరికాదన్నారు. తాము చదువుకుని స్వయం ఉపాధిగా ఈ వృత్తిని ఎంచుకున్నామన్నారు. ప్లాన్ అప్రూవల్ నుండి నిర్మాణం పూర్తి చేసే వరకు తాము పర్యవేక్షణ చేసిన అతిక్రమణలు జరిగితే మున్సిపాలిటీకి తెలియజేయాలన్న నిబంధనలు సరికాదన్నారు. తమకు ఎటువంటి కార్యాలయ సిబ్బంది ఉండరని, అలాంటప్పుడు తాము ఎలా పర్యవేక్షణ చేయగలమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే డాక్యుమెంటేషన్‌లు న్యాయపరమైన అంశాలు తమనే పరిశీలించాలని నిబంధన కూడా సరైంది కాదని, తమకు న్యాయపరమైన అంశాలపై సరైన అవగాహన ఉండదని, కాబట్టి డాక్యుమెంటేషన్‌లో న్యామపరమైన అంశాల విషయంలో న్యాయవాధులకు బాధ్యత అప్పగించాలని కోరారు. మంచి జీవో తెచ్చినప్పటికీ కూడా అందులో కొన్ని చిక్కుల నేపథ్యంలో తాము ప్లాన్లు గీయడానికి, దరఖాస్తు చేయడానికి భయపడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కావునా సెల్ఫ్ డిక్లరేషన్ సర్టిఫికేషన్ స్కీంలో తమకు ప్రతిబంధకుంగా ఉన్న నిబంధనలను తలగించాలని కోరారు. ఈ అంశాలపై రాష్ట్ర అసోసియేషన్‌తో సంప్రదించి తదుపరి కార్యాచరణ ఉంటుందన్నారు. ఇప్పటికే తమ ఇబ్బందులను మున్సిపల్ శాఖామంత్రి నారాయణ, మంత్రి లోకేష్‌ల దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని తెలిపారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్ కోశాధిఆరి కె గంగాధర్, గరవ అధ్యక్షులు సాయిబాబు, ఇతర ప్రతినిధులు టి శ్రీనివాస్, అవినాష్, ప్రసాద్, ఎం శ్రీనివాస్, నవభూషణ్, కృష్ణంరాజు, ఎంవిఎల్ ప్రసాద్, బూర శ్రీనివాస్, జానకి రెడ్డి, ఎన్ పవన్ కుమార్‌లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.



భీమవరం, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుండి స్వీకరించిన అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత శాఖల అధికారులును ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్‌ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి పంచాయితీ, రెవెన్యూ, భూ సమస్యలు, సర్వే, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, డి ఆర్ డి ఎ, ఐసిడిఎస్, వయోవృద్ధుల సంక్షేమం, తదితర శాఖలకు సంబంధించిన 237 అర్జీలను స్వీకరించారు. అందిన ప్రతి ఒక్క అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని నిర్ణీత గడువులోపుగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుండి అందిన ఫిర్యాదుదారుల నుండి స్వీకరించిన వాటిలో కొన్ని ఈ విధంగా ఉన్నాయి. 1) తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామానికి చెందిన పెరుమళ్ళ సత్యనారాయణ దంపతులు అర్జీని సమర్పిస్తూ మేము మా కుమారుడికి ఎకరం పొలమును రాసి ఇచ్చినామని, అతడు హైదరాబాదులో ఉంటూ మమ్మలని చూడటం లేదని తిరిగి మా ఆస్తి మాకు అప్పగించేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. 2)ఆకివీడు మండలం సిద్దాపురం, చిన్నమిల్లి, గ్రామాలకు చెందిన రెవిన్యూ పరిధిలోగల జిరాయితి పట్టా భూములు ఫిషర్మెన్ సొసైటీ భూములలో కేంద్ర ప్రభుత్వం పరిష్కారంలో ఎన్ బి డబ్ల్యు ఎల్ ఆమోదము మేరకు మా భూములు మాకు ఇప్పించాలని ఆ గ్రామాలకు చెందిన కోనాల ఏసు పాదం, కర్ర మోషే, ఉచ్చుల చెల్లయ్య తదితరులు కోరారు. 3) నా భూమి ఆక్రమణకు గురి అయినది సర్వే చేయించి హద్దులు చూపాలని పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామానికి చెందిన బొక్క చంద్రావతి కోరారు. 4) ఇరగవరం మండలం తూర్పు విప్పర్రు గ్రామంలో ఇరిగేషన్ కెనాల్ గట్టును ఆక్రమించుకుని ట్రాక్టర్లు వెళ్లకుండా, వ్యవసాయ పనులకు ఆటంకం కల్పిస్తున్నారు. చర్యలు తీసుకోవాలని రైతులు ఏ.సూర్యనారాయణ, ఏ.లక్ష్మీనరసింహరావు కోరారు. 5) పెంటపాడు మండలం పరిమెళ గ్రామంలో ప్రజలు వెళ్లే రహదారికి అక్రమముగా మురుగు తూములను పెట్టి ఇబ్బందులు కలిగించుచున్నారు. చర్యలు తీసుకోవాలని పెంటపాడు మండలం పరిమెళ్ళ గ్రామానికి చెందిన చవ్వాకుల వెంకటలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, వయోవృద్ధుల ఆప్పిలేట్ ట్రిబునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ల్యాబ్ పరికరాలు సిద్ధం. ప్రయోగాలు కీలకం

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

విజ్ఞాన శాస్త్రానికి ప్రయోగశాల ఒక శక్తిమంతమైన అభ్యాసన వనరుగా గుర్తించిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆ దిశగా దృష్టి సారించారు. విజ్ఞానశాస్త్ర విద్యలో అంతర్భామైన ప్రయోగశాల సైన్స్ కు చెందిన వివిధ భావనలు అర్థం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించడానికి ఇది ఉపయోగపడుతుందని ఎంపీ మహేష్ కుమార్ గుర్తించారు. ఎంపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల సందర్శన సందర్భంగా ల్యాబ్ పరికరాల కొరత ఉన్నట్లు ప్రధానోపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నారు. ప్రయోగాలు చేయడం ద్వారా విద్యార్థులు ప్రత్యక్ష అనుభవ విజ్ఞానాన్ని పొందగలుగుతారని, ప్రయోగశాలల ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులలో పరిశీలన, వర్గీకరణ, విశ్లేషణ మొదలైన నైపుణ్యాలు పెంపొందించగలరని భావించిన ఎంపీ మహేష్ కుమార్ ల్యాబ్ పరికరాలు సమకూర్చుతానని ఎంపీ మహేష్ కుమార్ అప్పట్లో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎంపీ నిధుల నుంచి రూ.2 కోట్లు కేటాయించారు. ఏలూరు పార్లమెంటు పరిధిలో మొదటి విడతగా 50 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి ఒక్కో పాఠశాలకు రూ.4 లక్షల విలువైన ల్యాబ్ పరికరాలను ఇటీవల స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, ఇన్చార్జి కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, డిఈఓ వెంకట లక్ష్మమ్మ, అధికారులతో కలిసి ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఒక్కో పాఠశాలకు ఇచ్చిన కిట్లలో 250 వరకు భౌతిక, రసాయన, గణిత, సామాజిక శాస్త్రాల ల్యాబ్ పరికరాలు ఉన్నాయి. వీటి ద్వారా విద్యార్థులు ప్రయోగాలు చేయడం వల్ల వివిధ విజ్ఞాన శాస్త్ర విషయాలపై ఆసక్తి పెంచుకుని, వాటి గురించి తెలుసుకుని భవిష్యత్తుకు విజ్ఞానపరంగా బాటలు వేసుకునేందుకు దోహదం చేయనుంది.



**మలి విడతల్లో మిగిలిన పాఠశాలలకు ల్యాబ్ పరికరాలు పంపిణీ.**

శాస్త్రీయ దృక్పథాన్ని, పెంపొందించుకోవడమే కాకుండా వివిధ విషయాలను తెలుసుకోవడంలోనూ, సమస్య పరిష్కారం చేయడంలోనూ శాస్త్రీయ పద్ధతిని విద్యార్థులు వినియోగించుకోగలుగుతారు.అంతేకాక ప్రయోగశాలలో చేసే ప్రాక్టికల్స్ వల్ల విజ్ఞానాత్మక సామర్థ్యాలు, శాస్త్రీయ వైఖరులు, విజ్ఞానశాస్త్రం పట్ల అవగాహన పెంపొందించుకోవడానికి వీలు కలుగుతుంది. గతంలో ఏ ఎంపి చేయని విధంగా ఉన్నత పాఠశాలలకు ల్యాబ్ పరికరాలు సమకూర్చిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. మలి విడతల్లో మిగిలిన పాఠశాలలకు కూడా ల్యాబ్ పరికరాలు సమకూర్చుతామని ఎంపీ మహేష్ కుమార్ చేసిన ప్రకటనను ప్రధానోపాధ్యాయులు స్వాగతిస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్నత పాఠశాలలో ప్రయోగాల తరగతుల నిర్వహణకు ల్యాబ్ పరికరాల కొరత అవరోధంగా మారింది. ఇకపై ఎంపీ మహేష్ కుమార్ సమకూర్చిన ల్యాబ్ పరికరాలతో ఫలవంతంగా నిర్వహించడానికి వీలు కలుగుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి : జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి




ఏలూరు, ఏప్రిల్ 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా నియోజకవర్గాలు వారీగా స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకుగాను అధికారులకు రెండు రోజులు పాటు నిర్వహించిన వర్కుషాపులో ఉభయ జిల్లాల చీఫ్ ప్లానింగు అధికారులు,నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ సిబ్బందితో కలిసి తొలిరోజు వర్కుషాపులో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పాల్గొన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంటు రూపొందించడంపై జిల్లా కలెక్టరు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా వార్డు, గ్రామ సచివాలయాలు డేటా అనుగుణంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు మనోభావాలు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ కు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుటలో ప్రత్యేక దృష్టి పెట్టారని ఇప్పటికే కుప్పం,పిఠాపురం,మంగళగిరి, ఉరవకొండ సహా నాలుగు నియోజకవర్గాలకు పైలట్ ప్రాతిపదికన విజన్ డాక్యుమెంట్లు ఇప్పటికే సిద్ధం చేశారని తెలిపారు.ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి, ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచి పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దిటకు రాష్ట్రం ప్రభుత్వం కృషి చేస్తోందని అందుకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్నారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ కోసం విజన్, ఆర్థికాభివృద్ధికి కీలక రంగాల పరంగా దృష్టి సారించాలని అన్నారు.ప్రజల జీవన ప్రమాణాల పెంపు, సుస్థిర మరియు పర్యావరణ అనుకూలమైన వృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు ఉద్యోగ అవకాశాలు పెంపుదల, భవిష్యత్తు నైపుణ్యాలు మరియు ఉద్యోగాల కల్పనకు, శ్రామికశక్తిని ప్రోత్సహం అందించే క్రమంలో దృష్టి పెట్టాలన్నారు.మహిళా సాధికారత - సంపూర్ణ మహిళా సాధికారత సాధనకు ఉపకరించే అంశాలు, రైతుల ఆకాంక్షలు, బలహీన వర్గాల వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ప్లాన్ లో స్పష్టంగా పొందుపరచాలని అన్నారు. వికసిత్ భారత్ నేపథ్యంలో రాష్ట్రంలో స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యసాధన కోసం నియోజక వర్గాలు వారీగా సమర్థ వంతంమైన ప్రణాళికలు అందజేయవలసి ఉందన్నారు. ఇందులో భాగంగా రానున్న 5 యేళ్ల కాలంలో 2029 వరకు ఒక విజన్ తో కూడిన నివేదిక రూపొందించ వలసివుందన్నారు.ఇందుకు జిల్లాలోని ప్రతి శాఖ ఈ లక్ష్యసాధనలో నిర్ణయాత్మక పాత్ర పోషించవలసి వుందన్నారు.వ్యవసాయ, ఉధ్యానవన,మత్స్య రంగాల్లో ప్రస్తుత విస్తరణ, దిగుబడులు, రానున్న రోజుల్లో అంతరసాగు విధానం,ఆదాయం పెంపు, ప్రకృతిసాగు విస్తీర్ణ పెంపు, తదితర అంశాలను ప్రణాళికలో పొందుపరచవలసి ఉందన్నారు.పాల ఉత్పత్తి పెంపుదలకు అవసరమైన అంశాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. పారిశ్రామిక,పర్యాటక రంగ, ఫుడ్ ప్రోసెసింగు యూనిట్ల స్థాపన,వంటి అంశాలను ప్రణాళికలో జోడించాలన్నారు. 2047 నాటికి జాతీయ మరియు ప్రపంచ వేదికలపై ఆంధ్రప్రదేశ్ ఎలాంటి పాత్ర పోషించడం వంటి అంశాలపై, తలసరి ఆదాయం ఎలా పెంచాలి తదితర అంశాలు పొందుపరచి విజన్ డాక్యుమెంటు రూపొందించాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అన్నారు. ఈ వర్కుషాపులో ఉమ్మడి జిల్లాల ముఖ్య ప్రణాళిక అధికారులు సి.హెచ్. వాసుదేవరావు,కె.శ్రీనువాస రావు,విశ్రాంత జాయింటు డైరెక్టరు మరియు సీనియరు ఎకనామిక్ సలహాదారులు డి.వి.వి.సీతాపతిరావు, నియోజక వర్గాల ప్రత్యేక అధికారులు,వివిధ శాఖల అధికారులు, సివిఏపి సిబ్బంది,ప్లానింగు టెక్నికల్ సలహాదారులు జి.దుర్గాప్రసాదు,డి.రామనాథ రెడ్డి,కె.రామ్ కిరణ్,తదితరులు పాల్గొన్నారు.



https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# బిహార్‌లో 'ఐఐటీ విలేజ్'.. జేఈఈ మెయిన్‌లో 40 మందికి పైగా ఉత్తీర్ణత

పత్వాటోలీ : జేఈఈ మెయిన్ ఫలితాలు ఇటీవల వెల్లడైన సంగతి తెలిసిందే. 2,50,236 మంది కనీస కటాఫ్ పర్సంటైల్ స్కోర్ సాధించి.. జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత సాధించారు. ఈ అర్హత సాధించిన వారిలో 40 మందికి పైగా ఒకే గ్రామానికి చెందినవారు కావడం గమనార్హం. బిహార్‌లోని గయ జిల్లాలో 'ఐఐటీ విలేజ్'గా పేరుపొందిన పత్వాటోలీ నుంచి వారంతా ఉత్తీర్ణత సాధించడం దేశం దృష్టిని ఆకర్షించింది. వారిలో 28 మంది వృక్ష సంస్థాన్ కోచింగ్ సెంటర్ నుంచి శిక్షణ పొందినవారే.



### పత్వాటోలీ ప్రత్యేకత ఏంటి..?

ఈ గ్రామం 'ఐఐటీ విలేజ్'గా పేరు పొందడానికి అసలు బీజం 1991లోనే పడింది. ఆ ఊరి నుంచి ఆ ఏడాది జితేంద్ర పత్వా ఐఐటీలో సీటు సంపాదించారు. ఆ ఘనత సాధించిన తొలి వ్యక్తి ఆయన. తర్వాత ఆయన కెరీర్ పరంగా ఎదిగి, యూఎస్‌లో నివసిస్తున్నారు. కానీ తన మూలాలను మర్చిపోకుండా మిగతావారు తనలాగే ఎదగాలని, %ఎతీఱఎంష్ట్ర ఔవ ఎష్ట్రవ జష్ట్రుఱఅస్త్రవ% పేరిట ఒక ఎన్జీఓను స్థాపించారు. ఇక అప్పటినుంచి ఆ గ్రామంలోని ప్రతి ఇంట్లో ఐఐటీ పదం వినిపిస్తూనే ఉంది. 20వేల మంది గ్రామస్థులు ఉన్న పత్వాటోలీని గతంలో మాంచెస్టర్ ఆఫ్ బిహార్‌గా పిలిచేవారు. వస్త్ర పరిశ్రమలు, చేనేత పని చేసుకునేవాళ్లు ఎక్కువగా ఉండటంతో ఆ పేరు వచ్చింది. ఇప్పుడది ఇంజినీర్లకు నిలయంగా మారింది. ఇప్పటికీ అక్కడి కుటుంబాలు చేనేత పని మీదే ఆధారపడినప్పటికీ.. వారి పిల్లలు మాత్రం విద్యారంగంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారు.

2013లో ఏర్పాటైన వృక్ష సంస్థాన్.. ఐఐటీల్లో చదవాలనుకునేవారికి ఉచిత కోచింగ్ అందిస్తోంది. గ్రాడ్యుయేట్లు అందించే నిధులతో మెటీరియల్స్ ఇస్తోంది. దిల్లీ, ముంబయిలో నివసించే వారు ఆన్‌లైన్ వేదికగా విద్యార్థులకు కోచింగ్ ఇస్తుంటారు. "చాలా కుటుంబాల్లో తమ పిల్లలను పట్టణాలకు పంపించి చదవించలేని పరిస్థితి ఉంది. అందుకోసమే మేం వృక్ష వేద చెయిన్‌ను ప్రారంభించాం. ఒక లైబ్రరీ మోడల్‌ను ఏర్పాటుచేశాం" అని వృక్ష వేద చెయిన్ ప్రెసిడెంట్ దుబేశ్వర్ ప్రసాద్ మీడియాకు వెల్లడించారు. పదో తరగతి దాటి చదవడమే కష్టమైన పరిస్థితులున్న ఆ గ్రామంలో బాలికలు ఉన్నత విద్యవైపు వెళ్లడానికి అవకాశాలు పెరిగాయి. ఇప్పుడు అక్కడ విద్యార్థులు నీట్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఇక తాజాగా జేఈఈ మెయిన్‌లో ఉత్తీర్ణత సాధించిన వారిలో 28 మంది వృక్ష సంస్థాన్‌లో కోచింగ్ తీసుకున్నారు.

# రూ.కోటి రివార్డ్ ఉన్న మావోయిస్టు ప్రయాగ్ మాంఝీ హతం..!

ఝార్ఖండ్: ఝార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో లాల్‌పానియా ప్రాంతంలోని లుగు పర్వత పాదాల వద్ద నేడు జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలకనేత హతమయ్యాడు. అతడిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఇప్పటికే రూ.కోటి రివార్డ్‌ను ప్రకటించింది. అతడి పేరు ప్రయాగ్ మాంఝీ అలియాస్ వివేక్. ఫుచన, నాగ మాంఝీ, కరన్, లెతర అనే పేర్లతో కూడా పిలుస్తారు. ఈ ఎన్‌కౌంటర్లో చనిపోయిన ఎనిమిది మందిలో అరవింద్, రామ్ మాంఝీ అనే మావోయిస్టులు ఉన్నారు. వీరిపై కూడా రూ.10 లక్షలు చొప్పున రివార్డులు ఉన్నాయి. ఈ ఎన్‌కౌంటర్ తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో చోటుచేసుకొన్నట్లు స్థానిక పత్రికలు పేర్కొంటున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.



### ప్రశాంత్ హిల్స్ అతడి అడ్డా..

కేంద్ర కమిటీ సభ్యుడైన ప్రయాగ్ మాంఝీ ముఖ్యంగా ప్రశాంత్ హిల్స్ కేంద్రంగా తన కార్యకలాపాలు నిర్వహించేవాడు. ధనాబాద్ జిల్లా తుండీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దల్‌బుద అతడి స్వగ్రామం. ఝూర?ండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో దాదాపు 100 దాడుల్లో ఇతడి హస్తం ఉంది. ఒక్క గిరిధి జిల్లాలోనే ఇతడిపై 50 కేసులతో పాటు రూ.కోటి రివార్డ్ ఉంది. ఝూర?ండ్‌లో అత్యధిక రివార్డ్ ఉన్న రెండో మావోయిస్టు ఇతడే. మాంఝీ కాకుండా మరో నలుగురి పైనే రూ.కోటి రివార్డులు ఉన్నాయి. ఇతడు పరస్నాథ్ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు సమాచారం అందడంతో పోలీసులు వేగులను అప్రమత్తం చేశారు. కొన్నాళ్ల క్రితం అతడిని చూడటంతో రూఢీ చేసుకొన్నారు.

సోమవారం తెల్లవారుజామున సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. వీరికి లుగు హిల్స్ వద్ద మావోయిస్టులు ఎదురుపడటంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి మావోలు అడవుల్లోకి పారిపోయారు. మొత్తం 8 మృతదేహాలను స్వాధీనం చేసుకొన్నారు. వీరిలో ప్రయాగ్ ఉన్నట్లు గుర్తించారు.

తాజా ఆపరేషన్‌లో ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ వంటి భారీ ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. 209 కోబ్రా బెటాలియన్, ఝూర?ండ్ పోలీసులు దీనిలో పాల్గొన్నారు. ఈ ఏడాది జార?ండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోలు ప్రాణాలు కోల్పోయారు. 2025 చివరికి రాష్ట్రాన్ని మావో రహిత రాష్ట్రంగా చేయాలని పోలీసులు లక్ష్యంగా పెట్టుకొన్నారు. 244 మంది మావోయిస్టులను రాష్ట్రంలో అరెస్టు చేశారు. పలు దళాల కమాండర్లతో కలిపి 24 మంది లొంగిపోయారు.

### ఏడాది క్రితమే భార్య అరెస్ట్..

ప్రయాగ్ మాంఝీ భార్య జయను గతేడాది పోలీసులు అరెస్టు చేశారు. ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. చికిత్స తీసుకోవడానికి వచ్చిన సమయంలో నాడు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ మృతి చెందింది.

# ఆ రూ.500 నోట్లతో జాగ్రత్త..

### హోంశాఖ హెచ్చరికలు

దిల్లీ: అత్యాధునిక టెక్నాలజీ వాడి తయారుచేసిన రూ.500 దొంగనోట్లు చెలామణిలోకి వచ్చినట్లు కేంద్ర హోంశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఈ సమాచారాన్ని డీఆర్ఐ, ఎఫ్ఐయూ, సీబీఐ, ఎన్ఐఏ, సెబీతో కూడా పంచుకొంది. ఆ దొంగనోట్ల ప్రింటింగ్, నాణ్యత చాలావరకు అసలు నోట్లులాగే ఉన్నట్లు వెల్లడించింది. వాటిని గుర్తించడం కూడా చాలా క్లిష్టంగా మారిందని వెల్లడించింది.



కాకపోతే ఈ నోట్లలో ఒక చిన్న స్పెల్లింగ్ తప్పు ఉందని.. దీనిని గుర్తించడంలో అదే కీలకమని పేర్కొంది. RESERVE BANK OF INDIA అనే దానిలో RESERVE పదంలో E బదులు A పడినట్లు వెల్లడించింది. ఈ చిన్న తప్పును గుర్తించాలంటే ఆ నోటును క్షుణ్ణంగా పరీక్షించాల్సి ఉంటుంది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఏజెన్సీలను అప్రమత్తంగా ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇవి మార్కెట్లో ఉన్నాయని హెచ్చరించారు. మార్కెట్లో మొత్తం ఎన్ని ఉన్నాయో గుర్తించడం కష్టమని ఉగ్ర ఫైనాన్స్‌పై దర్యాప్తు చేస్తున్న ఓ అధికారి చెప్పారు. ప్రజలు, వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

# వారు హంతకులకంటే ప్రమాదకరం..

### పిల్లల అక్రమ రవాణాపై సుప్రీంకోర్టు



దిల్లీ: దేశ రాజధాని ప్రాంతంలో ఇటీవల అదృశ్యమైన ఆరుగురు పిల్లలను రక్షించాలని దిల్లీ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా పిల్లల అక్రమ రవాణా విషయంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్నారుల అక్రమ రవాణాకు పాల్పడేవారిని చట్టం ముందు నిలబెట్టాలని.. అలాంటి ముఠాలు ఈ సమాజానికి ఎంతో ప్రమాదకరమని హెచ్చరించింది. నవజాత శిశువులను రూ.లక్షలకు అమ్ముతున్నట్లు వచ్చిన వార్తలపై జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మాధవన్‌లతో కూడిన ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది.

"ఆ ఆరుగురు చిన్నారుల ఆచూకీని తప్పకుండా గుర్తించండి. పిల్లలను అమ్ముతున్న, కొంటున్న వారిని చట్టం ముందు నిలబెట్టండి. వారందరూ నిందితులే. వారంతా సమాజానికి పెద్ద ముప్పుగా పరిణమించారు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిల్లల అక్రమ రవాణాదారులు.. హంతకులకంటే ప్రమాదకరమని జస్టిస్ పార్దివాలా అన్నారు. "ఎవరైనా ఒక వ్యక్తిని హత్య చేస్తే.. దాని వెనక పలు కారణాలు, ఉద్దేశాలు ఉంటాయి. ఆ తర్వాత అతడు మరో హత్య చేయకపోవచ్చు. కానీ.. పిల్లలను కిడ్నాప్ చేసి అమ్మేవారు.. ఆ నేరాలకు మళ్లీ మళ్లీ పాల్పడుతున్నారు. వారు ఈ సమాజానికి మరింత ప్రమాదకరమైనవారు" అని ఆందోళన వ్యక్తంచేసింది.

దిల్లీలో పిల్లల అక్రమ రవాణా రాకెట్ వెనకున్న కీలక సూత్రధారిని వెంటనే పట్టుకోవాలని దిల్లీ పోలీసులను కోర్టు ఆదేశించింది. దిల్లీ పరిసర ప్రాంతాల్లో చిన్నారులను రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విక్రయిస్తున్నారని.. దీని వెనక ఒక పెద్ద ముఠా పనిచేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని కోర్టు పేర్కొంది. అయితే.. వీరిలో కొందరు చిన్నారులు అపహరణకు గురికాలేదని.. తల్లిదండ్రులే అమ్మేస్తున్నారని కోర్టుకు పోలీసులు నివేదించారు. పిల్లలు దొరికిన అనంతరం వారిని తిరిగి తీసుకోవడానికి తల్లిదండ్రులు సిద్ధంగా లేకపోతే.. అప్పుడు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని కోర్టు పేర్కొంది.

ప్రతి ఏడాది దాదాపు రెండు వేల పిల్లల అక్రమ రవాణా కేసులు వెలుగులోకి వస్తున్నాయని జాతీయ క్రైమ్ రికార్డు బ్యూరో నివేదికలు వెల్లడిస్తున్నాయి.

# ఈ వారంలోనే రష్యా, ఉక్రెయిన్ డీల్ ఉండొచ్చు: ట్రంప్



రష్యా : రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృషి చేస్తున్న విషయం తెలిసిందే. యుద్ధం విషయంలో పురోగతి ఏమీ కనిపించకుంటే.. ఆ రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చే ప్రయత్నాల నుంచి తాము విరమించుకుంటామని ఇటీవల ఆయన ఇరుదేశాలను హెచ్చరించడంతో తాము చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ మరో కీలక విషయం వెల్లడించారు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందం ఈ వారంలోనే కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఆ రెండు దేశాలు తమతో కలిసి భారీగా వ్యాపారం చేయబోతున్నాయని ట్రూత్ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు.

వ్యాపార ఒప్పందాల నుంచి ఆ దేశాలు తమతో కలిసి సంపద గడిస్తాయని వ్యాఖ్యానించారు. యుద్ధం కారణంగా దెబ్బతిన్న ఉక్రెయిన్ అభివృద్ధికి ఇవి దోహదపడతాయన్నారు. ఇదే విషయంపై ఇటీవల అమెరికా అధ్యక్షుడు మాట్లాడుతూ.. తొందరలోనే ఉక్రెయిన్ శాంతి ఒప్పందం సాకారం అవ్వొచ్చని చెప్పారు. ఈ మేరకు అమెరికా ఓ శాంతిఒప్పందం ముసాయిదా తయారుచేసి ఐరోపా నేతలకు వెల్లడించగా.. వారినుంచి సానుకూల స్పందనలు వచ్చినట్లు పేర్కొన్నారు. వచ్చే వారం లండన్‌లో మరో రౌండ్ చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

యుద్ధాన్ని ముగిస్తున్నందుకుగాను ఉక్రెయిన్‌తో ఖనిజాల ఒప్పందానికి సంబంధించిన మెమోరాండం ఆఫ్ ఇంటెంట్‌పై సంతకాలు చేశామన్నారు. అదే విధంగా రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా క్రిమియాపై మాస్కో నియంత్రణను గుర్తించేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

కాగా ఒకవైపు శాంతి చర్చలకు ట్రంప్ ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ మరోవైపు రష్యా- ఉక్రెయిన్‌లు మాత్రం దాడులను కొనసాగిస్తున్నాయి. ఈస్టర్ సందర్భంగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామని ప్రకటించిన రష్యా.. కీవ్‌పై ఆదివారం పదులకొద్దీ డ్రోన్, బాంబు దాడులకు పాల్పడినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. కీవ్ బలగాలూ దాడులు కొనసాగించాయని రష్యా అధికారులు వెల్లడించారు.

# బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లు..

## ఆ ఇద్దరికి మళ్లీ చోటు.. తెలుగు కుర్రాడికి ఛాన్స్

**చెన్నై :భారత క్రికెట్ బోర్డు 2024-25 ఏడాదికి సంబంధించి సెంట్రల్ కాంట్రాక్ట్‌లను ప్రకటించింది. గత సంవత్సరం బీసీసీఐ ఆగ్రహానికి గురై కాంట్రాక్ట్‌ను కోల్పోయిన శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌కు మళ్లీ చోటు దక్కింది. ఇక తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డికి అవకాశం వచ్చింది. మొత్తం 34 మంది క్రికెటర్లను నాలుగు కేటగిరీల్లో ఎంపిక చేసింది.**



### గ్రేడ్ A+లో ఎవరంటే?

కాంట్రాక్టుల్లో టాప్ కేటగిరీ అయిన గ్రేడ్ A+లో నలుగురికి అవకాశం వచ్చింది. భారత కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా ఇందులో ఉన్నారు. వీరికి ఏడాదికి రూ.7 కోట్లను వేతనం ఇవ్వనుంది. బుమ్రా మినహా మిగతా ముగ్గురూ టీ20లకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. అయినా, టాప్ గ్రేడ్‌లోనే కొనసాగడం విశేషం.

### గ్రేడ్ Aలో వీరే..

ఈ గ్రేడ్‌లో ఆరుగురు ప్లేయర్లకు చోటు దక్కింది. హైదరాబాదీ బౌలర్ మహ్మద్ సిరాజ్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్య, మహ్మద్ షమీ, రిషభ్ పంత్ ఉన్నారు. వీరికి ఏడాదికి రూ.5 కోట్ల చొప్పున భత్యాలు అందుతాయి.

### గ్రేడ్ Bలో ఎవరంటే?

భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ గ్రేడ్ B కాంట్రాక్ట్ వచ్చింది. అతడితోపాటు కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్‌కు ఛాన్స్ వచ్చింది. అయ్యర్‌ను గతేడాది కాంట్రాక్ట్ నుంచి తీసేసిన సంగతి తెలిసిందే. ఈ జాబితాలోని వారికి సంవత్సరానికి రూ.3 కోట్ల వేతనం వస్తుంది.

### గ్రేడ్ C జాబితా ఇదే..

యువ క్రికెటర్లకు ఎక్కువగా ఈ జాబితాలోనే చోటు దక్కింది. టీ20ల్లో కీలకంగా మారిన వారిని ఎక్కువగా ఎంపిక చేయడం గమనార్హం. రింకు సింగ్, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, శివమ్ దూబె, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, ముకేశ్ కుమార్, సంజుశాంసన్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, రజత్ పటీదార్, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్, నితీశ్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, ఆకాశ్ దీప్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణాకు అవకాశం లభించింది. వీరికి ఏడాదికి రూ. కోటి చొప్పున చెల్లించనుంది.

# చెన్నైకు 'ప్లేఆఫ్స్' ఛాన్స్.. గతేడాది ఆర్సీబీలా ఆడితేనే!

చెన్నై : ఐపీఎల్‌లో గెలుస్తుందనే మ్యాచుల్లో ఓడిపోవడం.. నాకౌట్‌కు చేరుకోవడం కష్టమనుకొనే టీమ్‌లు ప్లేఆఫ్స్‌కు వెళ్లడం ఇప్పటికే మనం చూశాం. ఇప్పుడందరి దృష్టి ధోనీసేన పైనే ఉంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో చివరన ఉన్న సీఎస్కే టాప్ -4లోకి దూసుకొచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇది సాధ్యం కావాలంటే ఒకే ఒక్క మార్గముంది. అదేంటి? గతంలో ఇలా ఏ జట్టైనా సాధించిందా? అనే విషయాలపై ఓ లుక్కేద్దాం.



### సీఎస్కే మిగిలిన ఆరింట్లోనూ గెలిస్తేనే..

చెన్నై సూపర్ కింగ్స్ ఇప్పటివరకు 8 మ్యాచులు ఆడింది. కేవలం రెండే విజయాలే ఉన్నాయి. అంటే నాలుగు పాయింట్లతో చివరి స్థానంలో కొనసాగుతోంది. ఇంకా ఆరు మ్యాచులు ఉన్నాయి. వాటన్నింటినీ గెలిస్తే సీఎస్కే ఖాతాలో 16 పాయింట్లు చేరతాయి. ముంబయితో మ్యాచ్ అనంతరం ధోనీ కూడా 'ప్లేఆఫ్స్'కు క్వాలిఫై కావడానికి ప్రయత్నిస్తామని చెప్పాడు కదా. అంటే ఏ చిన్న ఛాన్స్‌ను మిస్ చేసుకోమని దాని ఉద్దేశం. విజయాలు సాధించడంతోపాటు నెట్‌రన్‌రేట్‌ను కాస్త మెరుగుపర్చుకుంటే సీఎస్కేకు తిరుగుండదు. అయితే, టాప్ -4 ప్లేస్‌ల కోసం ఇప్పటికే తీవ్ర పోటీ నెలకొంది. ఏ ఒక్క మ్యాచ్‌లో ఓడినా తలుపులు మూసుకుపోవడం ఖాయం. చెన్నై సూపర్ కింగ్స్ తన సొంత మైదానం చెపాక్‌లో మూడు మ్యాచులను ఆడనుంది. మిగిలిన మూడు బయట వేదికల్లో తలపడాల్సి ఉంటుంది.

### ఎవరెవరితో మ్యాచులు?

సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఏప్రిల్ 25) - చెన్నై
పంజాబ్ కింగ్స్ (ఏప్రిల్ 30) - చెన్నై
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (మే 3) - బెంగళూరు
కోల్‌కతా నైట్‌రైడర్స్ (మే 7) - కోల్‌కతా
రాజస్థాన్ రాయల్స్ (మే 12) - చెన్నై
గుజరాత్ టైటాన్స్ (మే 18) - అహ్మదాబాద్


బెంగళూరు కూడా ఇలానే..

వరుసగా ఆరు మ్యాచులు ఓడిపోవడం.. తొలి ఎనిమిదిలో ఒకేఒక్క విజయం.. ఇలాంటి టీమ్ ప్లేఆఫ్స్‌కు వస్తుందని ఎవరైనా ఊహించగలరా? కానీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అసాధ్యమనుకున్న ఘనతను సుసాధ్యం చేసింది. ఐపీఎల్ 2024 సీజన్‌లో ఇలాంటి అరుదైన ఫీట్ నమోదైంది. అద్భుతంగా పుంజుకొన్న ఆర్సీబీ తాను ఆడిన తొమ్మిదో మ్యాచ్ నుంచి 14వ మ్యాచ్ వరకు వరుసగా ఆరింట్లో గెలిచింది. టాప్-4లో నిలిచి ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. ఎలిమినేటర్‌లో రాజస్థాన్ చేతిలో ఓటమి పాలైందనుకోండి అది వేరే విషయం. అతి తక్కువగా ఉన్న ఛాన్స్‌లను ఏమాత్రం వదులుకోకుండా వరుసగా విజయాలను నమోదుచేసిన ఆర్సీబీని ఇప్పుడు సీఎస్కే స్ఫూర్తిగా తీసుకోవాలి. అప్పటి బెంగళూరుతో పోలిస్తే ఇప్పటి చెన్నై పరిస్థితే కాస్త మెరుగు.. కానీ, మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ మాత్రం సీఎస్కేకు అవకాశాలు చాలా క్లిష్టంగా ఉన్నాయని వ్యాఖ్యానించాడు.

# ఇది ఛారిటీ కాదు.. ఆ రెండు గోల్స్ ముఖ్యం

## ఆర్ఆర్‌పై రాయుడు వ్యాఖ్యలు

**రాజస్థాన్ : రాజస్థాన్ రాయల్స్ మేనేజ్‌మెంట్‌పై మాజీ క్రికెటర్ అంబటి రాయుడు కీలక వ్యాఖ్యలు చేశాడు. వరుసగా రెండు మ్యాచుల్లో గెలవాల్సిన పరిస్థితుల నుంచి ఓటమి బాట పట్టడంపై ఆశ్చర్యం వ్యక్తంచేశాడు. అసలు మేనేజ్‌మెంట్ ఆలోచనా విధానం ఏంటో అర్థం కావడం లేదని.. ఐపీఎల్ వంటి మెగా టోర్నీలోకి అడుగు పెట్టినప్పుడు రెండే గోల్స్‌పై దృష్టిపెట్టాలని వ్యాఖ్యానించాడు. ఎక్కువగా యువకులపై ఇన్వెస్ట్ చేయడం మంచిదే కానీ టోర్నీల్లో గెలవడం కూడా ముఖ్యమని పేర్కొన్నాడు.**



"ఎప్పుడు రాజస్థాన్ రాయల్స్‌ను చూసినా నాకొక ప్రశ్న తలెత్తేది. ఎందుకు ఎక్కువగా యంగ్‌స్టర్స్ మీదనే సంవత్సరాలుగా ఇన్వెస్ట్ చేస్తున్నారని అనుమానం ఉండేది. దానివల్ల ఏం సాధించారు? తొలి సీజన్ మినహా.. 17 ఏళ్ల నుంచి విజేతగా నిలవలేదు. ఒకవేళ ఇదే వారి బలమని భావిస్తే అది ప్రదర్శన రూపంలో బయటకు రావాలి. అలా రాకపోతే పరిస్థితి ఇలానే ఉంటుంది. కానీ, ఇది ఛారిటీ కాదు. మనం ఇక్కడ పోటీ పడటానికి వచ్చాం. ఐపీఎల్ టైటిల్‌ను గెలవడానికి ప్రయత్నించాలి. ప్రతి జట్టూ ఇదే ఫార్ములాతో బరిలోకి దిగుతాయి. ఐపీఎల్ వంటి పెద్ద లీగుల్లో కుర్రాళ్లకు అవకాశం ఇవ్వడం మంచిదే. కానీ, విజయాలపైనా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది" అని రాయుడు వెల్లడించాడు. దీనికి మాజీ క్రికెటర్ మార్క్ బౌచర్ కూడా రాయుడు వ్యాఖ్యలను సమర్థించాడు. జట్టు కోసం ఏ స్థానంలోనైనా ప్లేయర్లు ఆడేందుకు సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించాడు.

### రాయుడుపై బ్యాన్.. మేం సెమీస్‌లో ఓడాం: ధావన్

అంబటి రాయుడు, శిఖర్ ధావన్ కలిసి దేశవాళీలో ఆడారు. ఈసందర్భంగా గత జ్ఞాపకాలను ధావన్ గుర్తు చేసుకున్నాడు. "అండర్ -19 క్రికెట్‌లో అంబటి రాయుడు గొప్ప ప్లేయర్. అండర్ -19 వరల్డ్ కప్‌లో అతడు మా కెప్టెన్. కానీ, సెమీస్‌కు ముందు రాయుడుపై నిషేధం పడింది. ఆ మ్యాచ్‌లో మేం ఓడిపోయాం" అని ధావన్ వెల్లడించాడు. దీనికి రాయుడు, ఆకాశ్ చోప్రా నవ్వేశారు. 2019 సీనియర్ల వన్డే వరల్డ్ కప్ జట్టులోకి రాయుడుకు అవకాశం దక్కలేదు. టీమ్‌ఇండియా సెమీస్‌లోనే ఓటమిపాలైన సంగతి తెలిసిందే. అప్పుడే విజయ్ శంకర్‌ను రాయుడు 'త్రీడీ' ప్లేయర్ అంటూ కామెంట్లు చేశాడు.

# ఆ ఇద్దరినీ కామెంట్రీ బాక్స్‌లోకి అనుమతించొద్దు: బీసీసీఐకి క్యాబ్ విజ్ఞప్తి





బెంగాల్ : ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఇటీవల జరిగిన కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ మ్యాచ్ అనంతరం అజింక్య రహానే మాట్లాడుతూ.. పిచ్ మీద ఆడటానికి ఇరు జట్లలోని ఆటగాళ్లు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపాడు. ఇదే విషయంపై మ్యాచ్ వ్యాఖ్యాతలు హర్షా భోగ్లే, సైమన్ డౌల్ సైతం అసహనం వ్యక్తంచేశారు. వారి వ్యాఖ్యలపై బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ స్పందిస్తూ.. తమ మైదానం క్యూరేటర్‌పై వ్యాఖ్యలు చేసిన కామెంటేటర్లపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగే మ్యాచులకు హర్షా భోగ్లే, సైమన్ డౌల్‌ను అనుమతించొద్దని.. మ్యాచ్‌లపై వారు కామెంటరీ చేయకుండా నిషేధించాలని బీసీసీఐని కోరింది. ఈమేరకు లేఖను అందజేసినట్లు క్యాబ్ పేర్కొంది.

ఫ్రాంచైజీ డిమాండ్ల ప్రకారం పిచ్‌లు సిద్ధం చేయడంలో హోం క్యూరేటర్ సహకారం లేకపోతే అజింక్య రహానే నేతృత్వంలోని ఫ్రాంచైజీ కొత్త హోమ్ గ్రౌండ్‌ను చూసుకోవాలని డౌల్ సూచించారు. స్వరాష్ట్రం కోసం ఆడుతున్న జట్టు ఏం కోరుకుంటుందో కూడా క్యూరేటర్ పట్టించుకోకపోతే... ఫ్రాంచైజీని వేరే చోటికి తరలించాలని ఆగ్రహం వ్యక్తంచేశాడు. క్యూరేటర్ పని కేవలం ఆటపై అభిప్రాయాన్ని తెలియజేయడం మాత్రమే కాదని.. అందుకోసం ఆయనకు డబ్బులు చెల్లించట్లేదని డౌల్ అన్నాడు. హర్షా భోగ్లే సైతం పిచ్ విషయంలో అసహనం వ్యక్తంచేశాడు. వారు తమ సొంత మైదానాల్లో ఆడుతుంటే.. వారికి ఉపయోగపడేలా ట్రాక్‌లను సిద్ధం చేయాలన్నాడు.

అయితే ఈ విషయంలో క్యాబ్ క్యూరేటర్ ముఖర్జీకి మద్దతుగా నిలిచింది. అతను ఏ తప్పు చేయలేదని.. వేదిక వద్ద సిద్ధం చేయాల్సిన పిచ్ స్వభావాన్ని ఏ ఫ్రాంచైజీ నిర్దేశించలేదనే బీసీసీఐ రూల్ బుక్‌ను మాత్రమే అనుసరిస్తున్నాడని పేర్కొంది. క్యాబ్ విజ్ఞప్తిపై బీసీసీఐ నుంచి ఇంకా అధికారిక స్పందన రానప్పటికీ.. సోమవారం ఈడెన్ గార్డెన్స్‌లో ఆతిథ్య కేకేఆర్.. గుజరాత్ టైటాన్స్‌తో తలపడనున్న ఐపీఎల్ మ్యాచ్‌పై హర్షా భోగ్లే, సైమన్ డౌల్ వ్యాఖ్యానించే అవకాశం లేదని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. %ఖూా% 2025 ఫైనల్ మ్యాచ్ కూడా మే 25న ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది.

# రోహిత్ శర్మ ప్రపంచ రికార్డు.. 'హిట్‌మ్యాన్'కే ఇది సాధ్యం!



**ముంబై : టీమిండియా కెప్టెన్, ముంబై ఇండియన్స్ దిగ్గజ క్రికెటర్ రోహిత్ శర్మ చాన్నాళ్ల తర్వాత అద్భుత ఇన్నింగ్స్‌తో మెరిశాడు. ఐపీఎల్-2025 ఆరంభం నుంచి పేలవ ఫామ్‌తో సతమతమైన ఈ ఓపెనింగ్ బ్యాటర్.. చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా 'వింటేజ్ హిట్‌మ్యాన్'ను గుర్తు చేస్తూ ప్రత్యర్థి జట్టు బౌలర్లపై విరుచుకుపడ్డాడు.**

### రోహిత్ ధనాధన్

చెన్నై విధించిన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ శర్మ 33 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా 45 బంతుల్లో 76 పరుగులతో అజేయంగా నిలిచి.. సూర్యకుమార్ యాదవ్ (30 బంతుల్లో 68 నాటౌట్)తో కలిసి ముంబైని విజయతీరాలకు చేర్చాడు. ఇక చెన్నైతో మ్యాచ్‌లో 'హిట్‌మ్యాన్' అంటూ అభిమానులు ఇచ్చిన బిరుదును రోహిత్ శర్మ మరోసారి సార్థకం చేసుకున్నాడు. ఆదివారం నాటి మ్యాచ్‌లో అతడి ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లతో పాటు ఏకంగా ఆరు సిక్సర్లు ఉండటం ఇందుకు నిదర్శనం. ఈ క్రమంలో రోహిత్ శర్మ ప్రపంచ రికార్డు సాధించాడు. టీ20 ఫార్మాట్లో ఒకే దేశంలో అత్యధిక సిక్సర్లు బాదిన క్రికెటర్‌గా చరిత్రకెక్కాడు. అంతకు ముందు ఈ రికార్డు వెస్టిండీస్ దిగ్గజం, యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ పేరిట ఉండేది.

ఒకే దేశంలో అత్యధిక సిక్సర్లు (అంతర్జాతీయ, లీగ్ క్రికెట్‌లో కలిపి) బాదిన క్రికెటర్లు

రోహిత్ శర్మ- ఇండియాలో- 361 సిక్సర్లు
క్రిస్ గేల్- వెస్టిండీస్‌లో- 357 సిక్సర్లు
విరాట్ కోహ్లి- ఇండియాలో- 325 సిక్సర్లు
మహేంద్ర సింగ్ ధోని- ఇండియాలో- 286 సిక్సర్లు
కీరన్ పొలార్డ్- వెస్టిండీస్‌లో- 276 సిక్సర్లు
సంజూ శాంసన్- ఇండియాలో- 274 సిక్సర్లు
నికోలస్ పూరన్- వెస్టిండీస్‌లో- 271 సిక్సర్లు.

ఇక ఓవరాల్‌గా రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో టీమిండియా తరఫున టెస్టుల్లో 88, వన్డేల్లో 344, టీ20లలో 205 సిక్స్‌లు కొట్టాడు. ఐపీఎల్‌లో 264 మ్యాచ్‌లు పూర్తి చేసుకుని 292 సిక్సర్లు బాదాడు.

### సీఎస్‌కే 176.. ఆలౌట్

ముంబై- చెన్నై మధ్య మ్యాచ్ విషయానికొస్తే.. వాంఖడేలో ఆదివారం జరిగిన చిరకాల ప్రత్యర్థుల పోరులో ఆతిథ్య ముంబై పైచేయి సాధించింది. టాస్ గెలిచి చెన్నైని బ్యాటింగ్‌కు ఆహ్వానించిన హార్దిక్ సేన.. ధోని బృందాన్ని 176 పరుగులకు కట్టడి చేసింది.

అనంతరం కేవలం ఒక వికెట్ కోల్పోయి 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన ముంబై.. తొమ్మిది వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. కాగా ఈ గెలుపుతో హ్యాట్రిక్ కొట్టిన హార్దిక్ సేన పాయింట్ల పట్టికలో ఆరోస్థానాని (8 మ్యాచ్‌లలో నాలుగు గెలిచి)కి దూసుకువచ్చింది.



# ప్రీతి జింటా ఓ సంచలనం..

## ఎం చేసిందో తెలుసా

### ఎఐ మాయాజాలం: సెలబ్రిటీలకు గట్టి దెబ్బ! ప్రీతి జింటా తాజాగా బాధితురాలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ యుగంలో, దీని వల్ల కలిగే ప్రయోజనాల గురించి అందరూ చర్చించుకుంటున్నారు. కానీ, ఇదే టెక్నాలజీ వల్ల కొన్ని తీవ్రమైన అనర్థాలు కూడా జరుగుతున్నాయి. ముఖ్యంగా, ఏమీ సంబంధం లేని వ్యక్తులను కలిపి, వారి వ్యక్తిగత జీవితాలను తారుమారు చేసేలా వాస్తవానికి దూరమైన, మాయా ప్రపంచాన్ని సృష్టించడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా, క్రికెటర్ మహ్మద్ షమీ, టెన్నిస్ స్టార్ సానియా మీర్జా పెళ్లి చేసినట్లు, హీరో ప్రభాస్, హీరోయిన్ అనుష్క శెట్టి పెళ్లి చేసి పిల్లల్ని చూపించినట్లు ఫేక్ వీడియోలు వైరల్ అయ్యాయి. ఇప్పుడు బాలీవుడ్ ముద్దుగుమ్మ ప్రీతి జింటా కూడా ఈ జాబితాలో చేరిపోయారు.

**వైరల్ వీడియో: ప్రీతి జింటాపై అసత్య ప్రచారం**

సోషల్ మీడియాలో ఇటీవల ప్రీతి జింటాకు సంబంధించి ఒక వీడియో తీవ్ర సంచలనం సృష్టించింది. అందులో ఆమె పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శికర్ ధావన్ (అయ్యార్)కి లిప్‌లాక్ ఇచ్చినట్లు చూపించారు. అయితే ఇది వాస్తవానికి నిజం కాదు. ఇది పూర్తిగా %ూ×% సృష్టించిన ఫేక్ వీడియో. ఇది నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ప్రీతి జింటా పేరు వాడుకుంటూ చేసిన ఈ అసభ్యకరమైన ప్రయత్నంపై నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. పెళ్లయి ఇద్దరు పిల్లల తల్లి అయిన మహిళను ఇలా అపహాస్యం చేయడం ఎంత మానవీయతకు విరుద్ధమో అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వీడియోలు క్రియేట్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యతాయుతమైన సోషల్ మీడియా వాడకానికి అడ్డుకట్ట వేయాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

# బాక్స్ ఆఫీస్ లో మిస్.. 'మనోరమా మ్యాక్స్' లో హిట్

## మలయాళ సినిమా 'పైంకిలి' - ఓటీటీలో కంటెంట్ మ్యాజిక్




సాధారణంగా మలయాళ సినిమాలు చిన్న బడ్జెట్‌లో భారీ విజయం సాధించడం మనం తరచూ చూస్తూనే ఉంటాము. కథా బలం, నటన, స్క్రీన్ ప్లే వంటి అంశాల్లో అత్యద్భుత ప్రతిభ చూపిస్తూ, కేవలం కథ చెప్పడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే మలయాళ చిత్రాలు ప్రేక్షకుల మనసులను అలరిస్తూ ఉంటాయి. అలాంటి సినిమాల జాబితాలోకి ఒక కొత్త అడిషన్ గా నిలిచింది 'పైంకిలి'. ఫిబ్రవరి 14 వ తేదీన వాలెంటైన్స్ డే సందర్భంగా థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ప్రస్తుతం ఏప్రిల్ 11 నుంచి 'మనోరమా మ్యాక్స్' ఓటీటీ వేదికగా అందుబాటులోకి . మిడిల్ క్లాస్ భావోద్వేగాలను, ప్రేమ కథని వినూత్నంగా చూపించిన ఈ చిత్రం, థియేటర్లలో పెద్దగా వర్క్ అవుట్ కాకపోయినప్పటికీ, ఓటీటీలో మాత్రం ఓ రేంజ్ లో దూసుకుపోతోంది.

**తక్కువ బడ్జెట్.. భారీ స్పందన!**

'పైంకిలి' సినిమాని సుమారు రూ.10 కోట్ల బడ్జెట్‌తో నిర్మించారు. కానీ, థియేటర్ల నుంచి ఈ సినిమాకు వచ్చిన వసూళ్లు కేవలం రూ.6 కోట్ల పరిమితిలోనే నిలిచిపోయాయి. థియేటర్ రన్ పరంగా ఒక మోస్తరు రెస్పాన్స్ వచ్చిందిగానీ, ఆశించిన స్థాయిలో కాదు. అయితే, ఓటీటీలో ఈ సినిమాకు వచ్చిన ఆదరణ మాత్రం ఊహించని స్థాయిలో ఉంది. కథలోని కొత్తదనం, నేచురల్ పెర్ఫార్మెన్సులు, మృదువైన హ్యూమర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుత కాలంలో కంటెంట్‌ను ఎక్కువగా వెతుక్కుంటున్న ఓటీటీ ప్రేక్షకులకు ఈ సినిమా ఒక మంచి ఎంటర్‌టైన్‌మెంట్ డోస్ అందిస్తోంది.

**కథలో నలుగురిని గుచ్చే కొత్తదనం**

ఈ సినిమా కథ చాలా సరళమైన కాన్సెప్ట్ మీద ఆధారపడింది. కథలో సుకుమార్ అనే వ్యక్తి తన అప్పుల నుంచి తప్పించుకునేందుకు మతిస్థిమితం లేని వ్యక్తిలా నటించడం మొదలుపెడతాడు. అదే సమయంలో షీబా బేబీ అనే అమ్మాయి తన పెళ్లి పట్ల అసంతృప్తితో కుటుంబాన్ని వదిలివేసి బయటకు వస్తుంది. ఈ పరిణామాలు సుకుమార్‌కు ఒక అవకాశం అందిస్తాయి. తన లక్ష్యాన్ని సాధించుకునేందుకు షీబాను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఆమెను తన ప్లాన్‌లోకి ఎలా లాక్కొచ్చాడు? ఆమె పాత్ర తన జీవితాన్ని ఎలా మార్చింది? అనేది కథలో ఆసక్తికర మలుపులను తీసుకువచ్చింది. కథలో ఈ వినూత్న యాంగిల్‌నే ఓటీటీ ప్రేక్షకులు తెగ ఎంజాయ్ చేస్తున్నారు.

**నటీనటుల పెర్ఫార్మెన్స్ %-% హైలైట్**

ఈ సినిమాలో అనశ్వర రాజన్, సాజిత్ గోపు తమ పాత్రలను అద్భుతంగా పోషించారు. అనశ్వర రాజన్ ఎమోషనల్ సీన్లలో చూపించిన మేచూరిటీ, సాజిత్ గోపు నటనలో కనిపించిన నేచురల్ టచ్ సినిమాకి మేజర్ ప్లస్ అయ్యాయి. దర్శకుడు శ్రీజిత్ బాబు, కథని చాలా నెమ్మదిగా, కానీ ఆసక్తికరంగా నడిపిస్తూ ప్రేక్షకులను కథలో కూర్చొని ఉండేలా చేశాడు. సంగీతం, సినిమాటోగ్రఫీ కూడా సినిమాకు మన్నించదగిన మూడ్‌ని అందించాయి. 'పైంకిలి' సినిమా మలయాళ ఇండస్ట్రీలో తక్కువ బడ్జెట్‌లో హై కంటెంట్‌తో తెరకెక్కిన మరో మంచి ప్రయోగం. థియేటర్లలో అంచనాలు తీరకపోయినప్పటికీ, ఓటీటీ వేదికగా ఈ సినిమా గట్టిగా నమ్మకం నెలకొల్పింది. ప్రేమ కథల్లో కొత్తదనం కోరుకునే ప్రేక్షకులు, హృదయాన్ని తాకే కథలు చూసే ఆసక్తి ఉన్నవారు తప్పకుండా ఈ సినిమాను ఓటీటీలో ఎంజాయ్ చేయవచ్చు.

## జంధ్యాల, ఈవీవీ స్టైల్‌లో

# 'సారంగపాణి జాతకం'

### నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్



ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీదేవీ మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మాణంలో మోహనకృష్ణ ఇంద్రగంటి తెరకెక్కించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూపా కొడువయూర్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా ఏప్రిల్ 25న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మీడియాతో ముచ్చటించారు. ఆయన చెప్పిన విశేషాలివే.. 'సారంగపాణి జాతకం'లో అన్ని రకాల అంశాలు ఉంటాయి. యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్, కామెడీ, లవ్ ఇలా అన్ని రకాల అంశాలుంటాయి. ఇంద్రగంటి గారు కథను చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. థియేటర్లో అందరూ హాయిగా నవ్వుకునేలా ఈ చిత్రం ఉంటుంది. ఓ ఫుల్ లెంగ్త్ కామెడీ మూవీ చేయాలనే లోటు ఈ చిత్రంతో తీరిపోయింది. జంధ్యాల గారితో ఇలాంటి ఓ పూర్తి వినోదాత్మక సినిమా చేయలేదే? అనే లోటు ఇప్పుడు తీరిపోయింది. కొన్ని చిత్రాలు ఆడియెన్స్‌కి ఎప్పుడూ గుర్తుండిపోతాయి. అలా ఈ 'సారంగపాణి జాతకం' చాలా కాలం పాటు గుర్తుండే చిత్రం అవుతుంది.

'జెంటిల్ మాన్, సమ్మోహనం' తరువాత మా కాంబోలో హ్యాట్రిక్ హిట్ రాబోతోంది. మోహనకృష్ణ రాసిన కథ, కథనం ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఫ్యామిలీతో పాటుగా యూత్ ఆడియెన్స్ అందరినీ మెప్పిస్తుంది. సినిమా చాలా బాగా వచ్చింది. ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని తీశాం. సరైన థియేటర్లు దొరకాలనే ఉద్దేశంతో కాస్త లేటుగా వస్తున్నాం. మంచి సీజన్ దొరకాలనే ఇప్పటి వరకు ఆగాం. సమ్మర్ హాలీడేస్ స్టార్ట్ అయ్యాయి. ఇదే మంచి సీజన్ అనుకుని మేం ఏప్రిల్ 25న వస్తున్నాం. సమ్మర్‌లో వినోదాన్ని పంచేందుకు మా చిత్రం రాబోతోంది.

సారంగపాణి జాతకం చిత్రం ఇప్పటికే చాలా మందికి చూపించాం. అందరూ అద్భుతంగా ఉందని అన్నారు. ఫస్ట్ హాఫ్ పూర్తిగా వినోదాత్మకంగా సాగుతుంది. ఇక ద్వితీయార్థం నెక్స్ట్ లెవెల్లో ఉంటుంది. జాతకం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. చాలా ఇంట్రెస్టింగ్‌గా, సస్పెన్స్‌గా ఉంటుంది. అలా అని మరీ అంత అన్ ప్రిడిక్టబుల్‌గా ఏమీ ఉండదు. అందరినీ హాయిగా ఎంటర్టైన్ చేసేలా మాత్రం ఉంటుంది. కథలో భాగంగానే కారెక్టర్లు వస్తాయి. ఏదో కావాలని ఇరికించినట్టుగా ఎక్కడా అనిపించదు. ప్రతీ పాత్రకు చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది. వెన్నెల కిషోర్, వైవా హర్ష, నరేష్ గారు, అవసరాల శ్రీనివాస్ గారు ఇలా అన్ని కారెక్టర్లు అద్భుతంగా నవ్విస్తాయి. ఈ కథ విన్నాక దర్శి అయితే బాగుంటుందని మేం అనుకున్నాం. ఇప్పుడు ' కోర్ట్ ' మూవీ వచ్చి ప్రియదర్శికి మరింత ఇమేజ్ పెరిగింది. కోర్ట్‌లో ఆయన సీరియస్‌గా కనిపించారు. కానీ ఈ చిత్రంలో అందరినీ గొప్పగా నవ్విస్తారు. ప్రియదర్శి ఈ చిత్రానికి వంద శాతం న్యాయం చేశారు. సమ్మోహనం లాంటి లవ్ స్టోరీ అయినా, జెంటిల్‌మెన్ లాంటి చిత్రమైనా, కామెడీని పండించడం అయినా ఇంద్రగంటి మార్క్ ఎలా ఉంటుందో ఆడియెన్స్ అందరికీ తెలుసు. ఇంద్రగంటి గారి కామెడీ టైమింగ్ ఈ చిత్రంలో నెక్స్ట్ లెవెల్లో ఉంటుంది. ఈ చిత్రం పైసా వసూల్‌గా ఉంటుంది.

ఒకప్పుడు మూడు నెలల్లో సినిమా పూర్తయ్యేది. అప్పట్లో మేం ఒక హీరోతో చేసిన తరువాత ఇంకో హీరోతో సినిమాను ప్లాన్ చేసేవాళ్లం. కానీ ఇప్పుడు ఒక్కొక్కరు నాలుగైదు ప్రాజెక్టులని లైన్‌లో పెడుతున్నారు. అంతా కాంబినేషన్స్ చుట్టూ తిరుగుతున్నారు. కానీ కథల గురించి పట్టించుకోవడం లేదు. నాకు సినిమాల పట్ల ఎక్కువ ప్యాషన్ ఉంటుంది. అందుకే నేను తీసిన ఆదిత్య 369 అయినా, జెంటిల్‌మెన్ అయినా, సమ్మోహనం అయినా, యశోద అయినా నా మార్క్ కనిపించాలని కోరుకుంటున్నాను. సారంగపాణి జాతకం చిత్రంలోని ప్రొడక్షన్ వ్యాల్యూస్ గురించి అందరూ గొప్పగా మాట్లాడుకుంటారు. ప్రస్తుతం ఉన్న ట్రెండ్‌కు తగ్గట్టుగా ఈ చిత్రాన్ని మల్చాలని అనుకున్నాం. జంధ్యాల గారి కామెడీ, ఈవీవీ గారి స్టైల్, ఇంద్రగంటి మార్క్ ఇలా అన్నీ ఉండేలా.. అందరినీ మెప్పించేలా, అందరికీ రీచ్ అయ్యేలా సినిమాను ప్లాన్ చేశాం. ఏప్రిల్ 18న సరైన థియేటర్లు దొరకడం లేదనే ఏప్రిల్ 25కి వచ్చాం. ఈ మూవీని ఏప్రిల్ 25న చాలా పెద్ద ఎత్తున రిలీజ్ చేస్తున్నాం. ఓవర్సీస్‌లోనూ 220 థియేటర్లకు పైగానే గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం. ప్రస్తుతం కొన్ని కథల మీద చర్చిస్తున్నాం. నాకు సీక్వెల్స్ అంటే చాలా భయం. అందుకే నేను వాటికి దూరంగా ఉంటాను. కానీ బాలకృష్ణ గారు మాత్రం 'ఆదిత్య 369' సీక్వెల్ పనులు స్టార్ట్ చేస్తే దానిలో భాగం అవుతాను. 'యశోద' డైరెక్టర్లు చెప్పిన రెండు కథలు నాకు చాలా నచ్చాయి. పవన్ సాధినేని చెప్పిన ఓ కథ కూడా చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. మళ్లీ మోహనకృష్ణ ఇంద్రగంటి గారితో ఇంకో సినిమా చేయబోతున్నాను. అన్నీ ఫైనల్ అయ్యాక అన్ని ప్రాజెక్టుల గురించి అధికారికంగా ప్రకటిస్తాను.

# 'ముత్తయ్య' నుండి పాట విడుదల




కె. సుధాకర్ రెడ్డి, అరుణ్ రాజ్, పూర్ణ చంద్ర, మౌనికా బొమ్మ ప్రధాన పాత్రల్లో నటించిన అవార్డ్ విన్నింగ్ మూవీ 'ముత్తయ్య'. ఈ చిత్రాన్ని దర్శకుడు భాస్కర్ మౌర్య రూపొందించారు. హైలైఫ్ ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిక్షనరీ ఎంటర్టైన్మెంట్ ఎల్ఎల్పి బ్యానర్లపై వంశీ కారుమంచి, వృందా ప్రసాద్ సంయుక్తంగా నిర్మించారు. దివాకర్ మణి ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ మరియు సహ నిర్మాతగా కూడా వ్యవహరించారు. త్వరలో 'ముత్తయ్య' సినిమా ఈటీవీ విన్ లో ప్రీమియర్ కు రెడీ అవుతోంది. ఈ రోజు స్టార్ హీరో విజయ్ దేవరకొండ చేతుల మీదుగా 'ముత్తయ్య' సినిమా నుంచి 'సీనిమాల యాక్ట్ జేశి..' పాటను రిలీజ్ చేశారు. ఈ పాట లాంచ్ చేయడం సంతోషంగా ఉందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా తమ కలల్ని సాకారం చేసుకోవాలని విజయ్ దేవరకొండ ఈ సందర్భంగా అన్నారు. 'ముత్తయ్య' సినిమా టీమ్ కు విజయ్ దేవరకొండ తన బెస్ట్ విశెస్ అందించారు.

'సీనిమాల యాక్ట్ జేశి..' పాటను మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్ రోడ్రిగ్స్ బ్యూటిఫుల్ ట్యూన్ తో కంపోజ్ చేశారు. దర్శకుడు భాస్కర్ మౌర్య ముత్తయ్య పాత్రను రిఫ్లెక్ట్ చేస్తూ లిరిక్స్ రాయగా, చిన్నా.కె. ఆకట్టుకునేలా పాడారు. 'సీనిమాల యాక్ట్ జేశి..' పాట ఎలా ఉందో చూస్తే - 'సీనిమాల యాక్టు జేశి ఎలిగిపోతవా.. బుట్టలల్లుకుంట ఊళ్ళె మిలిగిపోతవా..ముత్తయ్య..
తిక్క తిక్క ఈడియోలు జేసుకుంటవా..స్టెప్పులేసి ఎగిరి దుంకి సంపుతుంటవా..ముత్తయ్య%ొ%. పేమసైతవా పేళ్లు గోళ్లు గిల్తవా..
దేశమంత లొల్లి జేస్తావా..
డ్యాన్సు జేస్తవా డయ్యిలాగు జెబుతవా ఓపికంత కూడ వెడ్తావా..
ముత్తయ్య..' అంటూ ముత్తయ్య వెండితెర కలను వర్ణిస్తూ సాగుతుందీ పాట. నటీనటులు - కె. సుధాకర్ రెడ్డి, అరుణ్ రాజ్, పూర్ణ చంద్ర, మౌనికా బొమ్మ, తదితరులు

టెక్నికల్ టీమ్
రచన, దర్శకత్వం - భాస్కర్ మౌర్య
నిర్మాతలు - వంశీ కారుమంచి, వృందా ప్రసాద్
బ్యానర్స్ - హైలైఫ్ ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిక్షనరీ ఎంటర్టైన్మెంట్ ఎల్ఎల్పి
సహ నిర్మాత - దివాకర్ మణి
అసోసియేట్ నిర్మాత - హేమంత్ కుమార్ సిఆర్
పీఆర్ఓ - జీఎస్ కే మీడియా (సురేష్ - శ్రీనివాస్)
సినిమాటోగ్రాఫర్ - దివాకర్ మణి
సంగీతం- కార్తీక్ రోడ్రిగ్స్
ఎడిటర్ - సాయి మురళి
సౌండ్ డిజైన్ & మిక్సింగ్ - వంశీప్రియ రసినేని
ఎగ్జిక్యూటివ్ నిర్మాత - వెంకట్ కృష్ణ
ఆర్ట్ - బాలు

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339